
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

శ్రీ పొట్టి శ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శనివారం 8 ఫిబ్రవరి 2025

అసాంఘికాలకు అడ్డాగా..

ఉదయగిరిలోని సచివాలయం-2, మండలంలోని నేలటూరు సచివాలయం పనులు ఏళ్ల తరబడి కొనసాగుతున్నాయి. ఒక్కో భవనానికి ప్రభుత్వం రూ.45 లక్షలు మంజూరు చేసింది. గత ప్రభుత్వం నిధులు సక్రమంగా మంజూరు చేయకపోవడంతో అవి అసంపూర్తిగా మిగిలిపోయాయి. అలాగే స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో రూ.78.55 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్ భవనం ప్రారంభించినా నిరుపయోగంగా మారింది. రైతులకు ఎలాంటి సేవలు అందడం లేదు. దీంతో భవనం చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచి శిథిలావస్థకు చేరుతోంది. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రూ.15 లక్షలతో నిర్మించిన అతిథిగృహం, హోటల్ భవనాలు ప్రారంభా నికి నోచుకోక శిథిలావస్థకు చేరాయి. నిరుపయోగంగా ఉన్న భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి.

- ఉదయగిరి


ఉదయగిరి : ప్రారంభించినా నిరుపయోగంగా మారిన అగ్రిటెస్టింగ్ ల్యాబ్ భవనం


ప్రారంభానికి నోచుకోని ఉదయగిరిలోని సచివాలయం-2 భవనం

రూ.లక్షలు పోసి..
ఇలా వదిలేసి!

- ప్రజాధనంతో ప్రభుత్వ భవనాల నిర్మాణం
- ప్రారంభానికి నోచకనే శిథిలస్థితికి
- వినియోగంలోకి తెస్తే అందరికీ మేలు

ఈ భవనాలను చూశారా!? వివిధ ఆకారాలలో పనులు పూర్తి చేసుకుని రంగుల్లో మెరిసిపోతున్నాయి కదూ. పాలకుల నిర్లక్ష్యమో.. అధికారుల అలసత్వమో తెలియదు కానీ రూ.లక్షలు పోసి నిర్మించిన ఈ భవనాలు నెలలు, సంవత్సరాల తరబడి నిరుపయోగంగా మారుతున్నాయి. భవనాల చుట్టూ పిచ్చిమొక్కలు మొలచి, తలుపులు, కిటికీలను చెదలు తినేస్తున్నా.. తుప్పు పడుతున్నా అటువైపు కన్నెత్తి చూసేవారే లేరు. ప్రజాధనంతో నిర్మించిన ఈ భవనాలు ప్రజాసేవలో తరలించాల్సిందిపోయి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోతున్నాయి.. కాదు కాదు మార్చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన

నెల్లూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : పాలు పితికే వారి నుంచి పిడకలమ్మేవారి వరకు అన్ని వర్గాల వారు ఏదో రూపంలో పన్ను కింద ప్రభుత్వ ఖజా నాకు జమ చేసే ప్రజాధనం నిరుప యోగం అవుతోంది. లక్షలాది రూపాయలతో భవనాలు నిర్మించి వాటిని వినియోగంలోకి తేకుండా గాలికి వదిలేశారు. సరికొత్త పాలనా వ్యవస్థ ద్వారా చిరస్థాయిగా నిలిచిపోవాలని భ్రమ పడిన పాలకుల పుణ్యమా అని అవసరం ఉన్న చోట, లేనిచోట లెక్కకు మించి భవన నిర్మాణాలను మొదలు పెట్టారు. రోడ్లపై విగ్రహాల తరహాలో ఊరూరా భవనాలు, శిలాఫలకాల రూపంలో చిరస్థాయిగా నిలిచిపోవాలనుకున్న గత పాలకులు ఆచరణలో మాత్రం విఫలమయ్యారు. ఫలితంగా జిల్లాలో ఎన్నో భవనాలను వివిధ కారణాలతో నిరుపయోగంగా మారాయి. కొన్ని పూర్తయినా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించని కారణంగా ప్రారంభానికి నోచుకోలేదు. ఇంకొన్ని నిధులు మంజూరుకాక అర్ధంతరంగా ఆగిపోయాయి. ప్రభుత్వం మారిన తరువాత ఈ భవనాలన్నీ అంటరానివిగా మిగిలిపోయాయి. దీనివల్ల

- మిగతా 6లో



ఈ భవనం సంగం ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్యశాలకు అనుబంధంగా గ్రామీణ ఆరోగ్య శిక్షణా కేంద్రము కోసం నిర్మించారు. 2019లో రూ. 2.26 కోట్ల నాబార్డు నిధులతో పూర్తయిన ఈ భవనాన్ని ఇదిగో ఇలా వదిలేశారు. నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు ఇక్కడున్న పీహెచ్‌సీకి వచ్చినప్పుడు వారు ఉండేందుకు ఈ భవనాన్ని నిర్మించారు. అత్యాధునిక వసతులతో నిర్మించిన భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాల్సి ఉంది.

- సంగం



కలిగిరి-2 గ్రామ సచివాలయాన్ని రూ.45లక్షలతో నిర్మించారు. పనులు పూర్తయ్యే సమయానికి ఎన్నికల కోడ్ వచ్చింది. ఇదిగో అప్పటినుంచి ఇదిగో ఇలా నిరుపయోగంగా మారింది. ఎంపీడీఓ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకున్న దృష్ట్యా ఆ కార్యాలయాన్ని గ్రామ సచివాలయం-2కు మార్చాలని అధికారులు భావిస్తున్నారు. కానీ ఆ భవనంలో సౌకర్యాలు లేవని పలువురు పేర్కొంటున్నారు.

- కలిగిరి


లింగసముద్రంలో మౌలిక వసతులు కల్పించని డిజిటల్ లైబ్రరీ

గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్కో సచివాలయ కేంద్రం వద్ద ఐదు భవనాలు నిర్మించాలని అట్టహాసంగా పనులు చేపట్టారు. ఇలా లింగసముద్రం మండలంలోని 13 సచివాలయాల పరిధిలో నిర్మించిన చాలా భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. కొన్ని సచివాలయాల వద్ద పాల కేంద్రాల నిర్మాణం పూర్తయినా నిరుపయోగంగా ఉన్నాయి. ఇక డిజిటల్ లైబ్రరీలు కూడా లింగసముద్రం, పెంట్రాలలో నిర్మించినా, మౌలిక వసతులులేక నిరుపయోగంగా ఉన్నాయి. ఇక పెంట్రాల, మొగిలిచెర్లలో కొన్ని భవనాల నిర్మాణాలు పూర్తయినా సిబ్బంది మాత్రం పంచాయతీ కార్యాలయాల్లో పని చేస్తున్నారు.

- లింగసముద్రం



వలేటివారిపాళెం మండలం అంకభూపాలపురంలోని ఈ భవనం సచివాలయం కోసం నిర్మించారు. అయితే, పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోక ఇదిగో ఇలా దిష్టిబొమ్మలా ఉంది. అయ్యవారిపల్లెలోనూ ఇదే పరిస్థితి. ఇక చుండి, అంకభూపాలపురం సచివాలయాల్లో రైతు భరోసా కేంద్రాలూ అసంపూర్తిగా ఉన్నాయి. అదేవిధంగా 15 హెల్త్ క్లినిక్ భవనాలకు 9 భవనాలు పూర్తయ్యాయి. మిగిలిన 6 భవనాలు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. అదేవిదంగా 15 పాలకేంద్రాలకు గానూ 2 భవనాలు పూర్తయ్యాయి. మిగిలిన 13 పాలవెల్లువ కేంద్రాల భవనాలు అసంపూర్తిగానే మిగిపోయాయి.

- వలేటివారిపాళెం

పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు



బైక్ దొంగలు దొరికారోచ్!

ఇవన్నీ అమ్మకానికి ఉంచిన సెకండ్ హ్యాండ్ బైక్‌లని అనుకుంటున్నారా!?. కాదండోయ్... ఆరు జిల్లాల పోలీసులను ముప్పుతిప్పలు పెట్టిన ఓ ముఠా కాజేసిన బైక్‌లు ఇవన్నీ. ఎంతో సాంకేతికతను వినియోగించి నలుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు విచారణలో దిమ్మతిరిగే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. మొత్తానికి 56 బైక్‌లను స్వాధీనం చేసుకోగా, కేసు పురోగతిలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు ఎస్పీ కృష్ణ కాంత్ రివార్డులు అందజేశారు.

- వివరాలు 6లో..

ఏ భూములు ఎక్కడ!?

- రామాయపట్నం పోర్టు పరిసరాల్లో అధికార యంత్రాంగం
- పోర్టు ఆధారిత పరిశ్రమల కోసం భూముల అన్వేషణ
- ఉలవపాడు, కావలి మండలాల్లో పర్యటన

కందుకూరు/ఉలవపాడు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : రామాయపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమల స్థాపన కోసం అనువైన భూములను సేకరించేందుకు అధికారుల బృందం శుక్రవారం పరిశీలించింది. రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్ కలెక్టరు ఓ. ఆనంద్‌తో కలిసి ఉలవపాడు, కావలి మండలాల్లోని పలు గ్రామాలలో భూములను పరిశీలించారు. ముందుగా ఉలవపాడు మండలం కరేడుకు చేరుకున్న పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, కలెక్టరు ఓ. ఆనంద్‌లు కరేడు పంచాయతీ పరిధిలో పరిశ్రమల స్థాపనకు ఉన్న అనుకూల పరిస్థితులను, అందుబాటులో ఉన్న భూములపై చర్చించారు. కరేడుతోపాటు అలగాయపాలెం, టెంకాయ చెట్లపాలెం, బట్టిసోమయ్యపాలెం పరిధిలో ఉన్న వేలాది ఎకరాల భూములను పరిశీలించారు. ఆ గ్రామ పరిధిలో ఉన్న పట్టా భూములు, ప్రభుత్వ భూముల వివరాలను కలెక్టరు పరిశ్రమల శాఖ కార్యదర్శికి మ్యాప్‌ల సహాయంతో వివరించారు. కరేడు చెరువును, అందులో పుష్కలంగా ఉన్న నీటిని కూడా పరిశీలించారు. కావలి రూరల్ మండలంలోని పలు గ్రామాలలోను పరిశ్రమలకోసం అనువైన భూములకోసం వారు పరిశీలన చేశారు. అనంతరం రామాయపట్నం పోర్టును పరిశీలించటంతోపాటు పోర్టు పరిధిలో ఏర్పాటు చేసి ఉన్న ఇండోసోల్ సోలార్ ప్యానల్స్ తయారీ పరిశ్రమను పరిశీలించారు. పరిశ్రమ సామర్థ్యం, భవిష్యత్తు విస్తరణ ప్రణాళికల గురించి ఆ పరిశ్రమ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు.

● బీపీసీఎల్ రానుండటంతోనే..

రామాయపట్నం పోర్టు పరిధిలో బీపీసీఎల్ రిఫైనరీ, పెట్రోకెమికల్స్ కర్మాగారం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం, ఇందుకు 6వేల ఎకరాలు అవసర మని బీపీసీఎల్ ఉన్నతా ధికారులు ప్రకటిం చిన విషయమే. ఈ కర్మాగారం ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటుకు కేంద్రం నిర్ణయం తీసుకోవడాన్ని రాష్ట్రాభివృద్ధికి కీలకంగా భావిస్తున్న కూటమి ప్రభుత్వం ఈ భూసేకరణను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. కేవలం బీపీసీఎల్‌కే 6వేల ఎకరాల భూమి అవసరం కాగా ఈ పరిశ్రమ పనులు ప్రారంభమైతే మరిన్ని పరిశ్రమలు ఇక్కడకు క్యూ కట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పరిశ్రమల కోసం వేలాది ఎకరాలు అవసరమవుతాయన్న అంచనాతో అధికారులు భూసేకరణ కసరత్తు చేస్తున్న నేపథ్యంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శే స్వయంగా పరిశీలనకు వచ్చారు. ఆయన వెంట ఏపీ మారిటైమ్ బోర్డు సీఈఓ ఓ. ప్రవీణ్ ఆదిత్య, కందుకూరు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ, కావలి ఆర్డీఓ వంశీకృష్ణ, రామాయపట్నం పోర్టు అధికారి రాజశేఖర్, ఆయా మండలాల తహసీల్దార్లు వివిధ శాఖల అధికారులు ఉన్నారు.


ఉలవపాడు : కరేడు పంచాయతీ పరిధిలో అందుబాటులో ఉన్న భూముల వివరాలను యువరాజ్‌కు వివరిస్తున్న కలెక్టరు ఆనంద్


రామాయపట్నం పోర్టు పురోగతిని అడిగి తెలుసుకుంటున్న యువరాజ్, తదితరులు

నెల్లూరు చెత్త
గుంటూరుకు..

- కంప్యాక్టర్ల ద్వారా తరలింపునకు సన్నాహాలు
- అల్లీపురం, దొంతాలి డంప్‌యార్డులకు ఇక సెలవు
- చెత్త రహిత నగరంగా త్వరలో నెల్లూరు
- టెండర్ల దశలో వాహన కొనుగోలు ప్రక్రియ

నెల్లూరులో ఉత్పత్తి అయ్యే చెత్తను గుంటూరుకు తరలించే ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. కంప్యాక్టర్ల ద్వారా ఏ రోజుకు ఆరోజు చెత్తను తీసుకెళ్లి గుంటూరులోని సాలిడ్ వేస్ట్ ఎనర్జీ ప్లాంటుకు చేర్చనున్నారు. ఇందుకోసం భారీ వాహనాల కొనుగోలుకు టెండర్ల ప్రక్రియ నడుస్తోంది. మరోవైపు అల్లీపురం, దొంతాలి ప్రాంతాలలోని డంపింగ్ యార్డులకు సెలవు ఇవ్వనున్నారు. త్వరలో చెత్త రహిత నగరంగా నెల్లూరును తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక తయారు చేసుకుంది. ఇందుకు ప్రస్తుతం ప్రయో గాత్మక దశ నిర్వహిస్తున్నారు.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)


అల్లీపురం నుంచి దొంతాలికి చెత్తను తరలిస్తున్న టిప్పర్

నెల్లూరు నగరంలో రోజుకు 300 టన్నుల చెత్త డంపింగ్ యార్డులకు చేరుతోంది. రోడ్లు, కూడళ్లు, ఇళ్ల నుంచి చెత్తను సమీకరించి మినీ ఆటోలు, ట్రాక్టర్లలో తీసుకువచ్చి అల్లీపురం డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అక్కడ నుంచి టిప్పర్ల ద్వారా దొంతాలి ప్రధాన డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఇందుకు కార్పొరేషన్ భారీగా నిధులు ఖర్చు చేస్తోంది. ఈ ప్రక్రియకు స్వస్తిపలికి నెల్లూ రులోని చెత్తను గుంటూరుకు తరలించే నూతన విధానానికి అధికారులు ప్రయోగాత్మక దశను పరిశీలిస్తున్నారు. ఇందులో ఫలితాలు మెరుగ్గా ఉంటాయని ఆశించిన యంత్రాంగం ఈ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఇందుకు అవసరమయ్యే భారీ వాహనాల కొను గోలుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. నగరం నుంచి సేకరించిన చెత్తను ఎక్కడా నేలపై పడకుండా వాహనాల్లోనే మార్పిడి జరిగి గుంటూరులోని ఎనర్జీ ప్లాంటుకు వెళ్లిపోతుంది.

● వాహనాలు కొనుగోలు దశలో..

రాష్ట్రాన్ని చెత్త రహితంగా తయారు చేసేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ వాహనాలు కొనుగోలుకు సిద్ధమైంది. అందులో మినీ, హెవీ కంప్యాక్టర్లను నెల్లూరుకు కేటాయించే ప్రక్రియ జరుగుతోంది. మినీ కంప్యాక్టర్ల వాడకం పై ఇటీవల నగరంలో ట్రయల్ రన్ నిర్వ హించిన అధికారులు ఫలితం ఆశించిన మేర ఉండటంతో కొనుగోలుకు సమ్మతి తెలిపారు. హెవీ కంప్యాక్టర్లను ఉన్నత స్థాయిలోనే ఓకే చేసిన అధికారులు తయారీ కంపెనీల నుంచి దిగుమతి కాగానే నెల్లూరుకు కేటాయించనున్నారు.

డంపింగ్ యార్డులకు సెలవు

54 మున్సిపల్ డివిజన్లలో సేకరిస్తున్న సుమారు 300 టన్నుల చెత్తను మినీఆటోలు, ట్రాక్టర్ల ద్వారా అల్లీపురం డంపింగ్ యార్డుకు చేర్చి అక్కడ నుంచి టిప్పర్ల ద్వారా దొంతాలిలోని ప్రధాన డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఇందుకోసం డివిజన్‌కి ఒక ట్రాక్టర్‌ను అద్దెకు తీసుకున్న అధికారులు, మినీ ఆటోలకు నెలవారి అద్దెలు చెల్లిస్తున్నారు. ఇవిగాక కార్పొరేషన్‌కు చెందిన చెత్తతరలింపు వాహనాలకు నెలకు రూ. కోటికి పైగా ఇందన ఖర్చు అవుతోంది. అలాగే అల్లీపురం నుంచి దొంతాలికి టిప్పర్లలో చెత్త తరలించేందుకు టెండర్లు పిలిచి భారీగా వ్యయాన్ని ఖర్చు చేస్తున్నారు. ఇదంతా కార్పొరేషన్ ఖజానాపై మోయలేని భారమవుతుంది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి వాహనాలను తీసుకుని నెల్లూరులో సేకరించే చెత్తను కంప్యాక్టర్ల ద్వారా గుంటూరుకు తరలించేందుకు పెట్టే ఖర్చు స్వల్పంగానే ఉండటంతో అధికారులు అందుకు సిద్ధమయ్యారు. ఈ ప్రక్రియతో అల్లీపురం, దొంతాలి డంపింగ్ యార్డులు ఖాళీ కానున్నాయి.



కసరత్తు జరుగుతోంది

నెల్లూరులోని చెత్తను గుంటూరుకు తర లించాలన్న కసరత్తు జరుగుతోంది. ఉన్నత స్థాయిలోనూ దీనిపై ఆమోద ముద్ర పడుతుంది. కార్పొరేషన్‌పై ఆర్థిక భారం తగ్గు తుంది. ఇక డంపింగ్ యార్డులతో పని ఉండదు.

- సూర్యతేజ, కమిషనర్

స్తంభాలే వంతెనలు !



నెల్లూరు నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ కొన్ని ప్రాంతాలు మాత్రం అభివృద్ధికి దూరంగా ఉండి పాలకుల నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ఇలాంటి పరిస్థితినే నగరంలోని పాత పెద్దాసుపత్రి ప్రాంతం ఉయ్యాల కాలువ సమీప ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఇక్కడి ఉయ్యాల కాలువపై వంతెనలు లేకపోవ డంతో వీరంతా నిత్యం సర్కస్ ఫీట్లు చేస్తు న్నారు. కొన్నిచోట్ల కాలువపై విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి పడిపోకుండా అటు.. ఇటూ కర్రలు కట్టి రాకపోకలు సాగిస్తున్నారు. వృద్ధులు, పిల్లలు ఈ స్తంభాలపై నడిచేందుకు భయాందోళన చెందుతున్నారు.



ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

అతివా.. యంత్ర సేవ!

- పొదుపు మహిళలకు డ్రోన్లు
- వ్యవసాయంలో వినియోగానికే!
- నాలుగు ప్రాంతాల్లో నలుగురు మహిళల ఎంపిక
- త్వరలో లబ్ధిదారులకు శిక్షణ

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : నేడు పొదుపుతోపాటు అన్ని రంగాల్లోనూ నారీమణులు రాణిస్తున్నారు. పొదుపు చేసిన చిన్న చిన్న మొత్తాలతో వ్యాపారాలు చేస్తూ కొందరు ఉపాధి పొందుతుండగా, మరికొందరు పారిశ్రామిక వేత్తలుగా ఎదుగుతున్నారు. తాజాగా జిల్లాలోని పొదుపు మహిళలకు డ్రోన్లు అందజేసి, వారికి ఉపాధి కల్పించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. వ్యవసాయ రంగంలోనూ అతివల ముద్ర పడేందుకు కేంద్ర ప్రభుత్వం 'నమో డ్రోన్ దీదీ యోజన' పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం వల్ల మహిళా సమాఖ్యలకు స్వయం ఉపాధితోపాటు రైతులకు మేలు చేకూరనున్నది. డ్రోన్ల వినియోగంపై మహిళలకు శిక్షణ ఇచ్చి వారిని పైలెట్లుగా మార్చేందుకు సంకల్పించింది. జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కింద జిల్లాలో మహిళా సమాఖ్యలకు ఈ డ్రోన్లు ఇవ్వనున్నారు. జిల్లాలో నాలుగు ప్రాంతాల్లో నలుగురు మహిళలకు డ్రోన్లు ఇవ్వడానికి ఎంపిక చేశారు. జిల్లాలోని గుడ్లూరు, చేజర్ల, కోవూరు, పొదలకూరు ప్రాంతాల్లో ఈ పథకం కింద మహిళలకు డ్రోన్లను అందజేయడానికి ఓ నివేదిక తయారు చేసి రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపారు. ఈ నివేదిక ఆమోదం పొందాక వారికి డ్రోన్ల వినియోగంపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెలాఖరు నుంచి ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. శిక్షణానంతరం రాయితీపై డ్రోన్లను అందించనున్నారు. ఒక్కొక్క డ్రోనుకు రూ.10లక్షల మేర ఖర్చు అవుతుండగా, అందులో 80 శాతం వరకు ప్రభుత్వం, మిగిలిన 20 శాతం మహిళా మండలి సమాఖ్యలు భరించేలా కసరత్తు జరుగుతోంది. ఈ నాలుగు చోట్ల వచ్చే ఫలితాల ఆధారంగా కార్యక్రమాన్ని జిల్లా మొత్తానికి విస్తరించనున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తున్నది.



అనుమతి రాగానే శిక్షణ

మహిళలకు ఉపాధి కల్పన ధ్యేయంగా నలుగురు మహిళలను డ్రోన్ల కోసం ఎంపిక చేశాం. ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. అనుమతి వచ్చిన వెంటనే ఆ మహిళలకు శిక్షణ ఇప్పించేందుకు ఏర్పాటు చేస్తాం.

- నాగరాజకుమారి, డీఆర్‌డీఏ పీడీ



12న కుంభమేళాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని ప్రయాగ్‌రాజ్‌లో ప్రతి ష్ఠాత్మకంగా జరుగుతున్న కుంభమేళాకు ఈ నెల 12వ తేదీన ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు నెల్లూరు-1వ డిపో మేనేజర్ మురళీకృష్ణ ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ప్రధాన బస్టాండు నుంచి 12న మధ్యాహ్నం 2 గంటలకు సూపర్‌లగ్జరీ బస్సు బయలుదేరి 13న సాయంత్రం ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుంటుందని తెలిపారు. తిరిగి 14న బయలుదేరి 15న రాత్రి అయోధ్యకు, 17న వారణాసికి చేరుకుంటుందని తెలిపారు. 18న అక్కడ బయలుదేరి 19న రాత్రి నెల్లూరుకు బస్సు చేరుకుంటుందని తెలిపారు. 8 రోజుల ప్రయాణానికి ఒక టికెట్ రూ.9 వేలు వసూలు చేయనున్నట్లు తెలిపారు. భక్తులే టీ, టిఫిన్, భోజనం, వసతి ఇతర ఖర్చులు పెట్టు కోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ లేదా నేరుగా రిజర్వేషన్ కౌంటర్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఇప్పటికే రిజర్వేషన్ పూర్తి అయ్యిందని, మొదటి బస్సు శనివారం ప్రధాన బస్టాండు నుంచి కదులుతుందని తెలిపారు.

చెత్త బండ్ల బ్యాటరీలు మాయం?



నెల్లూరులోని పాతమున్సిపల్ కార్యాలయం వద్ద నిలిపి ఉంచిన చెత్త తరలించే వాహనాల్లోని బ్యాటరీలు మాయమయ్యాయని తెలిసింది. ఉప యోగించని వాహనాలను ఈ ప్రాంగణంలో ఉంచుతారు. వాటికి ఉన్న బ్యాటరీలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లినట్లు శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో చర్చ జరిగింది. ఇవన్నీ ఖరీదైన వాహనాలు. ఇలాంటివి ఉన్న ప్రదేశంలో తగిన రక్షణ, పర్యవేక్షణ లేకపోవడంతో తరచూ చోరీలు జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు విచారణ చేపడితే అనేక వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

- నెల్లూరు(సిటీ,ఆంధ్రజ్యోతి)

జావెలిన్‌త్రోలో మాల్యాద్రికి బంగారు పతకం

- సత్కరించిన శాప్, గ్రంథాలయ సంస్థ చైర్మన్లు




మాల్యాద్రిని సత్కరిస్తున్న శాప్, గ్రంథాలయ చైర్మన్లు

కావలి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పారా క్రీడల్లో 50ప్లస్ జావెలిన్‌త్రోలో గోల్డ్‌మెడల్ సాధించిన పారాక్రీడల కమిటీ జిల్లా అధ్యక్షుడు టీసీ మాల్యాద్రి నాయుడుని రాష్ట్ర శాప్‌చైర్మన్ రవినాయుడు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావులు సత్కరిం చారు. విజయవాడ శాప్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమం జరిగింది. జిల్లా పారా క్రీడల కమిటీ అధ్యక్షుడిగా జిల్లా పారా క్రీడలను సమర్థవంతంగా నిర్వహించినట్లు కొనియాడారు.

నేడు భీష్మ ఏకాదశి

- వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు



నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : భీష్మ ఏకాదశి... మహా భారత సంగ్రామంలో భీష్మ పితామహుడు శరీరాన్ని త్యజించిన రోజు. విష్ణు సహస్ర నామాన్ని మానవాళికి అందించిన రోజు. కురు పాండవ యుద్ధంలో అంపశయ్యపై ఉన్న భీష్ముడు ఉత్తరాయణ పుణ్యకాలం ప్రవేశించే వరకు వేచి ఉండి మాఘ శుద్ధ ఏకాదశి రోజున కన్నుమూశారు. భీష్మ ఏకాదశి రోజున నిష్ఠగా ఉపవాసం చేయడం వలన బాధలు అన్ని తొలగి దుష్ట శక్తులనుంచి విముక్తి పొందుతారని పండి తులు చెబుతారు. భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా జిల్లాలోని అన్ని వైష్ణవ ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు జరగనున్నాయి. సామూహిక సత్యనారాయణ వ్రతాలు, విష్ణు సహస్రనామ పారాయణం చేయనున్నారు.

- నెల్లూరులోని తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో ఉదయం 8.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథ స్వామికి తిరుమంజనం, సాయంత్రం 6.30గంటలకు గరుడసేవ జరుగుతాయి. భక్తులందరూ తరలిరావా లని ఈవో ఏవీ శ్రీనివాసరెడ్డి కోరారు.
- పప్పులవీధి ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం 8 గంటలకు సామూ హిక వీరవెంకట సత్యనారాయణ స్వామి వ్రతం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యు డు పాదర్తి బాలాజీ ఓ ప్రకటనలో తెలిపారు.

గొల్లబోయిన స్వామికి ప్రత్యేక పూజలు



గజవాహనంపై విహరిస్తున్న గొల్లబోయిన స్వామి, అమ్మవారు

రాపూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనకు అనుబంధ ఆలయం అయిన గోనుపల్లిలోని గొల్లబోయిన స్వామివారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో స్వామి వారిని, అమ్మవారిని అలంకరించి గజ వాహనంపై ఊరేగించారు.

అన్ని రంగాల్లో ఆత్మకూరు అభివృద్ధి

- మంత్రి ఆనం వెల్లడి



ఆత్మకూరులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర మంత్రి ఆనం

ఆత్మకూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరులో పదేళ్లుగా అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, తన హయాంలో ఆ పనులు పునఃప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడి తెలిపారు. శుక్రవారం ఆయన ఆత్మకూరులో విస్తృతంగా పర్యటించారు. ముందుగా ఆత్మకూరు టిడ్కో గృహ సముదాయంలో శ్రీ సీతారాముల ఆలయానికి భూమిపూజ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పంచాయతీరాజ్ అతిథిగృహ నిర్మాణానికి శంకుస్థాపన, తదనంతరం ఆర్ అండ్‌బీ అతిగృహం, బీసీ రెసిడెన్సియల్ బాలికల పాఠశాల ప్రారంభోత్సవ ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆత్మకూరులో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు మంత్రులు, ప్రజా ప్రతినిధులు విచ్చేస్తున్నరని తెలిపారు. ఈ నెల 9న ఉదయం 10 గంటలకు టిడ్కో గృహ సముదాయంలో రూ.25 లక్షలతో రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు. బీసీ బాలికల గురుకుల పాఠశాలు తొలుత 60 మంది విద్యార్థినులతో ప్రారంభమవుతుందని, అంచెలంచెలుగా 600 మందికి ప్రవేశాలు కల్పిస్తామన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేస్తున్లట్లు తెలిపారు ఆత్మకూరు నియోజకవర్గంలో రూ. 580 కోట్లతో ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు చేసి స్వచ్ఛమైన మంచినీటిని సరఫరా చేస్తామని తెలిపారు. అనంతరం 21 మంది లబ్దిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పావని, మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, కమిషనర్ సి గంగాప్రసాద్, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి వెంకటరమణమ్మ, సోమశిల ప్రాజెక్ట్ ఛైర్మన్ కేశవచౌదరి, నాయకులు మెట్టుకూరు ధనుంజయరెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి, బొల్లినేని గిరినాయుడు, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివయ్య సంబరాలకు శ్రీకారం

- మూలస్థానేశ్వరాలయంలో గుంజ ప్రతిష్ఠ



గుంజకు పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మూలస్థానేశ్వరాలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలకు శుక్రవారం గుంజ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ఈనెల 21 నుంచి మార్చి 5వతేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఆ ఉత్సవాల పనులు ప్రారంభించేందుకు గుంజ ప్రతిష్ఠ చేశారు. గుంజను ప్రత్యేకంగా అలంకరించి పూజించారు. గోపూజ, గణపతి పూజ, నవగ్రహ పూజలు జరిపారు. ఆలయ మాజీ ఛైర్మన్ అల్తూరు గిరీష్‌రెడ్డి, పుట్టా విజయకుమార్‌రెడ్డి, ఈవో అర్వభూమి శ్రీనివాసులురెడ్డి, మాజీ ఈవో వేణుగోపాల్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ కనబడితే అంతే!

- ఆరు జిల్లాల్లో స్కూటర్లను మాయం చేస్తున్న ముఠా
- నలుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు
- రూ.30లక్షల విలువైన 56 బైక్‌ల స్వాధీనం



సీసీఎస్ సీఐ అశోక్‌కు రివార్డు అందిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్, పక్కన ఏఎస్పీ, డీఎస్పీ తదితరులు

నెల్లూరు (క్రైం), ఫిబ్రవరి 7 (ఆంధ్ర జ్యోతి) : వారి లక్ష్యం సీసీ కెమెరాలు లేని ప్రాంతాలు.. ముందుగా మాటు వేస్తారు.. జనం లేని సమయంలో రోడ్డుపై పార్క్ చేసిన బైక్‌లను క్షణాల వ్యవధిలో మాయం చేస్తారు. అలా ఆరు జిల్లాల్లో చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసిరిన ఓ ముఠా ఎట్టకేలకు పట్టుబడింది. నెల్లూరు జిల్లా పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ముఠాలోని నలుగురు సభ్యులను అరెస్ట్ చేయడమేగాక, 56 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు పూర్వాపరాలను శుక్రవారం నెల్లూరులోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ కృష్ణకాంత్ శుక్రవారం విలేకరులకు వెల్లడించారు.

అల్లూరు మండలం నార్త్ ఆములూరుకు చెందిన ఎ శివను 2017లో హత్యాయత్నం కేసులో పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ఆ తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చిన శివ తన చిన్నమ్మ కుమారుడు రవిదుర్గతో కలిసి బైక్ దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కి జైలుకెళ్లాడు. పాతనేరస్థులైన అల్లూరు మండలం చౌటపాలెంకు చెందిన కె నాని, హోసన్నలను కలుపుకొని నలుగురూ ముఠాగా ఏర్పడ్డారు. సీసీ కెమెరాలు లేని ప్రాంతాలను టార్గెట్ చేసుకొని రాష్ట్రంలోని నెల్లూరు, తూర్పుగోదావరి, వైఎస్సార్ కడప, ప్రకాశం, బాపట్ల, తిరుపతి జిల్లాల్లో బైక్ దొంగతనాలకు పాల్పడుతూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్నారు. నెల్లూరు జిల్లాలో బైక్ దొంగతనాలు అధికమవడంతో ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాలతో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ సీతారామయ్య, అశోక్, కొడవలూరు సీఐ సురేంద్రబాబు తమ సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలుగా ఏర్పడ్డారు. సాంకేతికతను ఉపయోగిస్తూ నిందితుల కోసం ముమ్మరంగా గాలించారు. ఈ నెల 6వ తేదీన కొడవలూరు మండలం పద్మనాభసత్రం వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా శివతోపాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. తమైదనశైలిలో విచారించగా పోలీసులే నివ్వెరపోయే వివరాలు వెలుగులోకి వచ్చాయి. నెల్లూరు జిల్లాలో 24, తిరుపతిలో 21, ప్రకాశంలో 8, బాపట్ల, తూర్పుగోదావరి, వైఎస్ఆర్ కడప జిల్లాల్లో మూడు బైక్‌లు చోరీ చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.30 లక్షలు విలువ చేసే 56 బైక్‌లను దొంగలించినట్లు నిందితులు అంగీకరించారు. పోలీసులు వారి నుంచి బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. సీఐలు సీతారామయ్య, అశోక్, సురేంద్రబాబు, సీసీఎస్, కొడవలూరు, విడవలూరు ఎస్ఐలు కోటిరెడ్డి, నరేష్, వెంకటాద్రినాయుడు, సిబ్బం దిని ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు పి సింధుప్రియ, ఘట్టమనేని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో డీఈల బదిలీ

నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 7 (ఆంధ్ర జ్యోతి): విద్యుత్తుశాఖలో పలువురు డీఈలను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు రూరల్ డివిజన్ డిప్యూ టీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నాయక్‌కు పదోన్నతి కల్పించి విజయవాడకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో టెక్నికల్ డీఈ ప్రభాకర్‌ను నియమిం చారు. కన్‌స్ట్రక్షన్ డీఈగా సురేష్ బాబును నియమిస్తూ ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా తక్షణం బాధ్యతలు స్వీకరించారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

- సీడబ్ల్యూసీ సభ్యుడు కొప్పుల రాజు



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాజు, దేవకుమార్‌రెడ్డి, ఇతర నాయకులు

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగాన్ని కాపాడుకు నేందుకు పార్టీ నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమి టీ (సీడబ్ల్యూసీ) సభ్యుడు కొప్పుల రాజు పిలుపు నిచ్చారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు జై భీమ్ జై బాపే జై సంవిధాన్ కార్యక్ర మం శుక్రవారం నెల్లూరులోని ఇందిరా భవన్‌లో జరిగింది. ఇందులో రాజు మాట్లాడుతూ 75 ఏళ్ల స్వతంత్ర భారతావనిని సమైక్యంగా ఉంచిన ఘనత రాజ్యాంగానికే దక్కుతుందన్నారు. రాజ్యాంగ నిర్మాతలను తూలనాడే విధంగా బీజేపీ నేతలు పార్లమెంట్‌లో మాట్లాడిన తీరు వారి దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. రాజ్యాంగం గొప్పతనాన్ని మండల, గ్రామ స్థాయికి తీసుకువెళ్లేందుకు ఏడాదిపాటు ప్రజలకు అవగాహన కల్పించాలని పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ నిర్ణయించారని, ఆ దిశగా నేతలు కార్యాచరణతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ దేశంలోని సంపదంతా కొద్ది మంది చేతుల్లోనే ఉందన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా నిరక్షరాస్యత, నిరుద్యోగం బీజేపీ పాలనలో తాండవిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు మస్తాన్ వలి, జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ, ఆర్ ఎస్ఎస్ వల్ల రాజ్యాంగానికి కలిగే నష్టాలపై ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఉడతా వెంకట్రావు, గోపాల్‌రెడ్డి, నరసింహ, కిరణ్‌కుమార్, ఫయాజ్, శ్రీనివా సులు రెడ్డి, అనిల్‌రెడ్డి, కల్యాణ్, డాక్టర్ యశోధర తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్షలు పోసి.. ఇలా వదిలేసి!

(5వ పేజీ తరువాయి)

గత పాలకులకు, ప్రస్తుత పాలకులకు ఎవరికీ నష్టం లేదు. నష్టపోయింది మాత్రం ప్రజలే. పన్ను రూపంలో పౌరులు చెల్లించిన కోట్లాది రూపాయల ప్రజాధనం ఎందుకు కొరగాకుండా పోయింది. సచివాలయ భవనాల పేరుతో కొన్ని, హెల్త్ క్లినిక్‌ల పేరుతో కొన్ని, అగ్రిలాబ్‌ల పేరుతో ఇంకొన్ని ఇలా పలు శాఖలకు సంబంధించిన ఉప కార్యాలయాల పేర్లతో వందలాదిగా భవనాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుత పాలకులైనా ఈ భవనాలను ప్రజావసరాల కోసం వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. లేనిపక్షంలో కోట్లాది రూపాయల ప్రజాధనం గోడకు కొట్టిన సున్నం సామెతలా మారతాయనే ఆవేదన వ్యక్తం అవుతోంది.

- కందుకూరు : ఉలవపాడు మండలంలో ఆర్బీకేలు 13 నిర్మించగా ఒక్క ఉలవపాడు సచివాలయం 3, అలగాయపాలెంలో మినహా మరెక్కడా ఆ భవనాలు ఉపయోగంలో లేవు. వీరేపల్లి, రామాయపట్నం, పెదపట్టపుపాలెంలలో అసంపూర్తిగా ఉన్నాయి. కందుకూరు, గుడ్లూరు మండలాల్లోను రైతు భరోసా కేంద్రాలు, పాలకేంద్రాలు నిర్మించారే కానీ వాటిని ఉపయోగిస్తున్న దాఖలాలు కనిపించటం లేదు.



ఉలవపాడు తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో నిర్మించి నిరుపయోగంగా ఉన్న హెల్త్‌సెంటర్ భవనం



కందుకూరు నియోజకవర్గంలో ప్రతి సచివాలయ పరిధిలో ఇలాంటి పాలకేంద్రం భవనాలు నిర్మించారు కానీ ఎక్కడా ఉపయోగిస్తున్న దాఖలాలు లేవు

మాలకొండలో తలనీలాల వేలం

- ఆదాయం రూ.2,30,10,000
- గతేడాది కంటే ఈ ఏడాది రూ.80.1 లక్షలు పెరిగిన ఆదాయం
- మిగిలిన 11షాపుల వేలం వాయిదా
- ఆలయ అధికారులు, పాటదారుల మధ్య స్వల్ప వివాదం
- పాట మధ్యలోనే వెళ్లిపోయిన పర్యవేక్షణాధికారి



మాలకొండలో వేలం పాటలు నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మాలకొండ లక్ష్మీనరసింహ స్వామికి తలనీలాల వేలం రూ.2,30,10,000 ఆదాయం వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్ బాబు తెలిపారు. శుక్రవారం కల్యాణ మండపంలో కందుకూరు శివాలయ కార్యనిర్వాహణాధికారి రవీంద్రనాథ్ పర్యవేక్షణలో జరిగిన బహిరంగ వేలంలో ఆయన మాట్లాడారు. తలనీలాలు వేలం గతేడాది కంటే ఈ ఏడాది రూ.80,10,000 పెరిగిందన్నారు. మిగిలిన కొబ్బరిచిప్పలు, కొబ్బరికాయలు, పాలు, పెరుగు నెయ్యి, వాహన పార్కింగ్, పూజా ద్రవ్యాలు, చీరలు, రవికలు, బొమ్మళ అంగళ్లు, కూల్‌డ్రింక్స్, ఫలహారసాలు, పాదరక్షలు వేలంలో సరైన పాటదారులు లేక ఆలయ అధికారులు వాయిదా వేశారు. అయితే వేలం నిర్వాహణలో పాటదారులు రెండువర్గాలుగా విడిపోయారు. అందులోని ఓ వర్గం పాట దారులు ఆలయ అధికారుల మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుంది. ఈ వివాదంలో పర్యవేక్షణాధికారి రవీంద్రనాథ్ వేలంను మధ్యలోనే వెళ్లిపోయాడు. దీనికితోడు తలనీలాలు మినహా మిగిలిన 11దుకాణాలకు సరైన పాట రానందున వాయిదా వేసినట్లు అధికారులు ప్రకటించారు. ఇంత జరిగినా ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.వి సాగర్‌బాబు నోరు విప్పకపోడం చర్చనీయాంశం అయ్యింది.

న్యూస్ బాక్స్

సోమశిలలో 65.416 టీఎంసీల నిల్వ

అనంతసాగరం ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శుక్రవారం 1,268 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 65.416 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,800, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలకు 11 మంది గైర్హాజరు

వెంకటాచలం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో శుక్రవారం జరిగిన డిగ్రీ మూడవ, ఆరవ సెమిస్టర్ మెగా సప్లీమెంటరీ పరీక్షలలో 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలలో 205 మంది విద్యార్థులకు గాను 194 మంది హాజరయ్యారు.

నగలు దోచిన కాంపౌండర్ అరెస్ట్

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం సరిగా లేని వ్యక్తికి ఇంజక్షన్ వేసే నెపంతో బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లిన ఘటనలో నిందితుడిని దర్గామిట్ట పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని పత్తేఖాన్‌పేటకు చెందిన కార్తీక్ నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో కాంపౌండర్‌గా పని చేస్తున్నాడు. మాగుంటలేవుట్‌కు చెందిన ఉదయ్‌శేఖర్‌రెడ్డి ఆ వైద్యశాలలో చికిత్స చేయించుకున్న సమయంలో కార్తీక్ పరిచయమయ్యాడు. కొంతకాలం క్రితం ఉదయ్‌శేఖర్‌రెడ్డి అనారోగ్యం పాలవడంతో అప్పటి నుంచి కార్తీక్ అతని ఇంటికి వెళ్లి ఇంజక్షన్ వేస్తున్నాడు. ఈ క్రమంలో వారి ఇంటి కప్‌బోర్డులో ఉన్న బంగారు ఆభరణాలను అపహరిస్తూ వచ్చాడు. విషయం తెలుసుకున్న బాధితుడు ఈ నెల 6వ తేదీ రాత్రి దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం నిందితుడిని బట్వాడిపాళెం సెంటర్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 95 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని సౌత్ రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్‌ఐ జీ మాలకొండయ్య ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. 40 నుంచి 45 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి మృతి చెందాడు. మృతదేహంపై నలుపురంగు హాఫ్ హ్యాండ్స్ షర్ట్, నలుపు రంగు చెక్స్ నైట్ ఉన్నాయి. కుడిచేతిపై వీఈ అనే అక్షరాలు రాసి ఉన్నాయి. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుని వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

కాలువలో మహిళ మృతదేహం

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి7, (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు - కోడూరు రహదారి వెంబడి అల్లీపురం వద్ద పంట కాలువలో రెగ్యులేటర్ వద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించారు. ఆ ప్రాంత వీఆర్వో గున్నయ్య నెల్లూరు రూరల్ పోలీసులకు సమాచారమిచ్చారు. 40-50 ఏళ్ల మధ్య వయసున్న మహిళ మృతి చెందిందని, మృతదేహం ఉన్న తీరునుబట్టి మరణించి సుమారు 10 రోజులు అయి ఉంటుందని సీఐ గుంజి వేణు తెలిపారు. మహిళ ఎవరన్నది తెలిసే ఆనవాళ్లు ఏమీ లేవన్నారు. అనుమానం ఉన్నవాళ్లు ఆచూకీ కోసం నెల్లూరు రూరల్ పోలీసులను సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ముగ్గుతో మార్పు యత్నం



చెత్త కుప్పను శుభ్రం చేసి ముగ్గేస్తున్న పారిశుధ్య కార్మికురాలు

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దని చెబుతున్నా ప్రజలు పాటించకపోతుండటంతో నెల్లూరు నగర కమిషనర్ సూర్యతేజ వినూత్న ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు. చెత్త వేస్తున్న బహిరంగ ప్రదేశాలను శుభ్రం చేయించి అక్కడ పారిశుధ్య కార్మికులతో ముగ్గులు వేయిస్తున్నారు. శుక్రవారం మొదలుపెట్టిన ఈ ప్రయత్నం సత్ఫలితాలిస్తుందని ఆశిస్తున్నారు. కాగా, కమిషనర్ శుక్రవారం 38వ డివిజన్‌లో పర్యటించారు. కార్పొరేషన్‌కు చెందిన స్థలాలు ఎవరైనా ఆక్రమించినా, వాటిలో కట్టడాలు నిర్మించినా చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

- నెల్లూరు (సిటీ,ఆంధ్రజ్యోతి)

సిటీ డీఎస్పీ నగర నిద్ర



మహిళల సమస్యలు తెలుసుకుంటున్న డీఎస్పీ సింధుప్రియ

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను వారి వద్దకే వెళ్లి తెలుసుకుని పరిష్కరించేందుకు సిటీ డీఎస్పీ సింధుప్రియ నగర నిద్ర కార్యక్రమం చేపట్టారు. నగరంలోని వీవర్స్ కాలనీలో శుక్రవారం రాత్రి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖ అందుబాటులో ఉండేలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అసాంఘిక కార్యక్రమాలు, గంజాయి విక్రయాలు, రౌడీషీటర్లు, అల్లరిమూకల ఆడగాడాలు వంటి వాటిపై ప్రజలు 112 నెంబర్‌కు సమాచారమివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ శివప్రియ, నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కష్టాలసుడిలో నేతన్న

తెల్లార్లూ ఇంటిల్లిపాది కష్టపడినా కనీసం కూలి కూడా గిట్టుబాటు కావడం లేదయ్యా. ఎన్ని ప్రభుత్వాలు మరుతున్న మా బతుకులు మాత్రం ఇదిగో ఇట్టాగే ఉన్నాయ్. ఎన్నికలప్పుడు మాత్రం నాయకులు మా కాలనీకొచ్చి అది చేస్తాం.. ఇది చేస్తాం అంటారు. తీరా గెలిచాక మా వైపు కన్నెత్తి చూడరు. ఏళ్లు గడుస్తున్నా మాకు కష్టాలు, కన్నీళ్లు తప్పడం లేదు.

- ఇది చేనేత కార్మికుల ఆవేదన

- ఇంటిల్లిపాది కష్టపడినా కూలి అంతంతే
- పెరిగిన ముడి నూలు, జరీ ధరలు
- అంతేస్థాయిలో నిత్యావసరాల ధరలు
- పనిముట్లు, వర్క్‌షెడ్లు మంజూరు చేయాలి
- చేనేత సంఘాల నాయకుల డిమాండ్

గుంతమగ్గంలో నేత నేస్తున్న కార్మికుడు



సంగం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : చేనేత పరిశ్రమ దుర్భరస్థితిలో ఉంది. చేనేతలకు గడ్డుకాలం ఏర్పడిందని.. కరోనా నాటి నుంచి ఇప్పటివరకు చేనేతలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని చేనేత సంఘాల నాయకులు గగ్గోలు పెడుతున్నారు. పట్టు చీరల నేతలో కీలకమైన పట్టు నాలుగు నెలల నుంచి కిలో రూ.వెయ్యి ధర పెరిగింది. గతంలో రూ.4,400 ఉంటే 5,500 చేరుకుంది. అయితే, మార్కెట్‌లో మాత్రం చీరల ధరలు పెరగలేదు. దీంతో మాస్టర్ వీవర్లు నేత కార్మికులకు కూలి తగ్గించారు. గతంలో ఒక బారు (ఐదు చీరలకు) రూ.2,500 ఉన్న కూలి ప్రస్తుతం 2,100లకు కుదించారు. ఒక బారు వారం రోజులు పడుతుంది. దీంతో నేత కార్మికులకు ఇంటిల్లిపాది కష్టపడినా రోజుకు రూ.300 కూడా కూలి గిట్టుబాటు కావడం లేదు. నేత పనికంటే 'ఉపాధి' కూలే మేలని నేత కార్మికులు వాపోతున్నారు. దీంతో పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు ఏం కొనలేక, తినలేక నేతన్నలు కుమిలిపోతున్నారు. కూటమి ప్రభుత్వమైనా సబ్సిడీ ధరకు అవసరమైన పనిముట్లు అందించి ఆదుకోవాలని చేనేతలు, నేత కార్మిక నాయకులు కోరుతున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

చేనేత పరిశ్రమలో నేసిన ఉత్పత్తులను ఆప్కో సంస్థ ద్వారా గిట్టుబాటు ధరకు కొనేలని చేనేత సంఘాల నాయకులు కోరుతున్నారు. అలాగే సబ్సిడీకి పనిముట్లు, వర్క్‌షెడ్లు అందించాలని, ఉచిత బీమాతోపాటు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. ఇక కేంద్ర ప్రభుత్వం నేతన్నలకు వారి అభివృద్ధి కోసం జీఎస్టీ రద్దు చేయాలని కోరుతున్నారు. జీఎస్టీ పెట్టినప్పటి నుంచి చేనేత పరిశ్రమ పూర్తిగా దెబ్బతినిందని, ధరలు పెరిగి జీఎస్టీ కట్టలేక పెట్టుబడులు లేక మాస్టర్ వీవర్స్ ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో చేనేత కార్మికుడికి నేతన్న నేస్తం కింద ఏడాదికి రూ.24 వేలు ఇచ్చేదని, కూటమి ప్రభుత్వం ఇంతవరకు దాని గురించి పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 300 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలు చేయాలని లేకపోతే ఎస్సీ, ఎస్టీల మాదిరి పీఎం సూర్య ఘర్ పథకం చేనేతలకు కూడా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

చేనేత పరిశ్రమను ఆదుకోవాలి



చేనేత పరిశ్రమ సంక్షోభంలో ఉంది. సక్రమంగా పని లేక కొందరు వేరే వృత్తుల్లోకి మారడం, మరి కొందరు చేనేత రంగం వదిలి వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు చేనేత కార్మికులను ఆదుకునేందుకు సబ్సిడీకి పనిముట్లు, వర్క్‌షెడ్లు ఇవ్వాలి. అదేవిధంగా జీఎస్టీ రద్దు చేయడంతోపాటు సంక్షేమ పథకాలు అమలు చేయాలి. ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. ఉచిత విద్యుత్తు వెంటనే అమలు చేయాలి. నూలు, పట్టు ధరలు తగ్గించాలి.

- బి బాలాజి, చేనేత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు

పీజీ, ఎల్ఎల్‌బీ పరీక్షలకు 293 మంది గైర్హాజరు

వెంకటాచలం, ఫిబ్రవరి 7 (ఆంధ్ర జ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో శుక్రవారం జరిగిన పీజీ మొదటి, ఎల్ఎల్‌బీ మూడవ సెమిస్టర్ పరీక్షలకు 293 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలలో 2016 మంది విద్యార్థులకు గాను 1842 మంది హాజరు కాగా, మిగిలిన 174 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలలో 1673 మంది విద్యార్థులకు గాను 1554 మంది హాజరు కాగా 119 మంది గైర్హాజరయ్యారు.

కర్నూలు హైకోర్టు బెంచ్‌లో నెల్లూరును కలపొద్దు

- లేకుంటే ప్రజాఉద్యమాన్ని నిర్మిస్తాం
- నిరసనలో 'బార్' నేత వేనాటి



నిరసనలో మాట్లాడుతున్న బార్ కౌన్సిల్ రాష్ట్ర సభ్యుడు వేనాటి చంద్రశేఖర్ రెడ్డి

నెల్లూరు (లీగల్), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : త్వరలో కర్నూలులో ఏర్పడనున్న హైకోర్టు బెంచ్‌లో నెల్లూరు జిల్లాను కలిపే ప్రయత్నం చేస్తే ప్రజా ఉద్యమాన్ని నిర్మించి ప్రభుత్వ చర్యలను ఎదుర్కొంటామని బార్ కౌన్సిల్ రాష్ట్ర సభ్యుడు వేనాటి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేనాటి మాట్లాడుతూ ఉదయాన్నే నెల్లూరు నుంచి అమరావతికి వెళ్లి హైకోర్టు పని పూర్తి చేసుకుని సాయంత్రానికి తిరిగి రావడం ఎంతో సులువుగా ఉందన్నారు. అలాంటిది 8 గంటల ప్రయాణం ఉన్న కర్నూలుకు మార్చడం వల్ల న్యాయవాదులు, కక్షిదారులు చాలా ఇబ్బందులు పడతారని ఆవేదన చెందారు. అందరి సమస్యను అర్థం చేసుకుని అమరావతిలోనే ఉంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ సానుకూలంగా స్పందించాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.ఉమామహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇలా ఒంటెద్దు పోకడలతో నిర్ణయాలు తీసుకుంటే తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ నిరసనలో బార్ ప్రధాన కార్యదర్శి పి.సుందరయ్య యాదవ్ లైబ్రరీ కార్యదర్శి స్వర్ణా ప్రసాద్, న్యాయవాదులు వేలూరు రంగారావు, సీపీ కృష్ణయ్య, భువనగిరి మధుసూదన్, పీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బర్లీ పొగాకు సాగుపై రైతుల మొగ్గు

- డీసీపల్లి బోర్డు పరిధిలో పెరిగిన సాగు విస్తీర్ణం



పొలంలోనే అల్లి, ఎండ కట్టిన బర్లీ పొగాకు

మర్రిపాడు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది ఆశించిన ధర లభించడంతో డీసీపల్లి పొగాకు బోర్డు పరిధిలో ఈసారి బర్లీ సాగు విస్తీర్ణం ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో అనూహ్యంగా పెరిగింది. తెగుళ్ల తాకిడితో ఆశించిన ధరలు లేకపోవటం, మిరప, బొప్పాయి వంటి పంటలను వదిలేసి ఎక్కువ మంది రైతులు బర్లీ సాగువైపు మొగ్గు చూపారు. కాగా, డీసీపల్లి బోర్డు పరిధిలో ఈ ఏడాది 1430 ఎకరాల మేర సాగు చేపట్టారు. ఎకరాకు రూ. 40వేలు ఖర్చు అవుతుంది. ఈ పొగాకు సాగుకు కూలీల ఖర్చు తక్కువ, బ్యారన్‌లో ఉంచి క్యూరింగ్ చేయాల్సిన పనిలేదు. పొలంలోనే ఆకు అల్లి, అల్లిన కర్రలను ఎండ పెడితే సరిపోతుండటంతో రైతుకు శ్రమ కూడా తక్కువగానే ఉంది. ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉండడంతో పైరు ఏపుగా పెరిగి మంచి దిగుబడులు వస్తాయనే ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం తోటల్లోని ఆకు కూలీలతో కోయించి పందిర్లపై ఎండబెట్టారు.

ప్రాక్టికల్ పరీక్షల్లో కీలకంగా ఉండాలి

- చీఫ్‌లతో ఆర్ఐవో శ్రీనివాసులు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 10వతేదీ నుంచి జరిగే ఇంటర్మీడియట్ జనరల్ విద్యార్థుల ప్రయోగ పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్లు కీలకంగా వ్యవహరించాలని ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు సూచించారు. నెల్లూరులోని డీకేడబ్ల్యూ కళాశాలలో శుక్రవారం చీఫ్‌లు, అడిషనల్ చీఫ్‌లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు జూనియర్ లెక్చరర్ స్థాయి అధికారిని ప్రభుత్వ కళాశాలల నుంచి చీఫ్‌గా నియమిస్తున్నామన్నారు. ప్రాక్టికల్స్ తీరుపై ఉన్న అపోహలు తొలగిపోయేలా నిబంధనల మేరకు పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రశ్నపత్రాలను సకాలంలో డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలు సమయానికి జరిగేలా చూడాలన్నారు. అనంతరం పలు అంశాలపై వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో డీవీఈవో మధుబాబు, డీఈసీ సభ్యులు దీనదయాళ్, వేణుగోపాల్, కొండయ్య, శ్రీనివాసరావు, సబ్జెక్ట్ నిపుణులు రమణారెడ్డి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ పరీక్షలకు 34 మంది గైర్హాజరు

ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్స్‌లో శుక్రవారం జరిగిన పరీక్షలకు 34 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షకు 283 మందికిగాను 265 మంది హాజరుకాగా 18 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 277 మందికి 261 మంది హాజరుకాగా 16 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐవో తెలిపారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఐవో శ్రీనివాసులు

బెల్టుషాపులపై ఉక్కుపాదం



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు

- ఇప్పటి వరకు 435 కేసుల నమోదు
- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బెల్టు దుకాణాలు ఏర్పాటు చేసినా, వారికి మద్యం సరఫరా చేసినా చర్యలు తప్పవని, నిరంతరం నిఘా ఏర్పాటు చేసి కేసులు నమోదు చేస్తున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆత్మకూరులోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యలయాన్ని ఆయన సందర్శించి, గీత కులాల మద్యం షాపుల దరఖాస్తు స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ నూతన మద్యం పాలసీ అమలులోకి వచ్చాక జిల్లాలో అనధికారికంగా మద్యం నిల్వ చేసి బెల్టుషాపులు నిర్వహిస్తున్న 435 మంది మీద కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. వీరి నుంచి 1020 లీటర్లు మద్యం స్వాధీనం చేసుకుని, ఐదు వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. దొరికిన మద్యం సీసాలు ఏ మద్యం షాపులోని అనే అంశాలపై తగిన ఆధారాలు లభించలేదన్నారు. అయితే మద్యం షాపుల నిర్వాహకులతో సమావేశాలు ఏర్పాటు చేసి హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు చెప్పారు. బెల్టు షాపుల్లో మద్యం సీసాలు పట్టుపడితే తొలిసారి రూ.5 లక్షలు జరిమానా, రెండవసారి లైసెన్సు రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే అధిక ధరలకు విక్రయాలు, సమయపాలన అమలుపై నిఘా ఉంచామన్నారు. ఉదయం వేళల్లో మద్యం విక్రయాలపై ఫిర్యాదులు వస్తున్న చోట టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీలు చేపట్టడంతోపాటు ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. ఈ సమావేశంలో ఆత్మకూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ ఆర్ వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య



జగదీష్ మృతదేహం

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు... చిత్తూరుకు చెందిన ముని జగదీష్(47), యశోద దంపతులు 15 ఏళ్ల క్రితం నెల్లూరుకు కాపురం వచ్చారు. సావిత్రి నగర్‌లో నివసిస్తున్నారు. వారి కుమారుడు గుజరాత్‌లో బీటెక్ చదువుతున్నాడు. యశోద వేదాయపాళెంలోని ఓ ప్రైవేటు కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తుండగా, జగదీష్ వెంకటాచలంలోని అక్షయపాత్ర ఫౌండేషన్‌కు లేబర్ సప్లై చేసే కాంట్రాక్టు పనులు చేస్తుంటాడు. అతను మద్యానికి బానిసై నిరంతరం మద్యం సేవిస్తూనే ఉండేవాడు. ఈ క్రమంలో ఆరు నెలల క్రితం అనారోగ్యం పాలయ్యాడు. మద్యపానం మానుకోవాలని వైద్యులు హెచ్చరించారు. అయినా జగదీష్ తీరు మారలేదు. భార్య నచ్చచెప్పినా వినలేదు. గురువారం మధ్యాహ్నం యశోద కళాశాల నుంచి భోజనానికి ఇంటికి వచ్చిన సమయంలో కూడా జగదీష్ మద్యం మత్తులోనే ఉన్నాడు. భోజనం తర్వాత తిరిగి కాలేజీకి వెళ్లిన యశోద సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా భర్త ఫ్యానుకు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. చుట్టుపక్కల వారి సాయంతో కిందకు దింపి హుటాహుటిన జీజీహెచ్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. యశోద శుక్రవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	112
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	230
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8168
వెండి కిలో ధర	రూ. 98,800
వెండి ఒక గ్రాము	రూ.101.80

పోలీసుల అదుపులో మోటారు దొంగ



నిందితులు చోరీ చేసిన మోటారు

సంగం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడు గ్రామ రైతులు ఓ మోటారు దొంగను పట్టుకుని శుక్రవారం పోలీసులకు అప్పగించారు. స్థానిక రైతుల వివరాల మేరకు గత కొంత కాలం నుంచి పొలాల్లోని మోటార్లు చోరీకి గురవుతున్నాయి. ఈ క్రమంలో గ్రామస్తులు దొంగలను పట్టుకోవాలని కాపుకాస్తున్నారు. ఈనేపథ్యంలో గురువారం అర్ధరాత్రి ముగ్గురు వ్యక్తులు ఆటోలో వచ్చి పొలాల్లోని మోటార్ల వైర్లు కత్తిరించి మోటార్లును ఆటోలో వేసుకుని వెళ్తుండగా రైతులు వెంబడించి పట్టుకున్నారు. ఇద్దరు పరార్ కాగా ఒకరిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆటోను, నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేకల దొంగలు పట్టివేత

కలువాయి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): దొంగిలించిన మేకలు గూడూరు సంతలో విక్రయిస్తుండగా వాటి యజమాని పట్టుకుని శుక్రవారం కలువాయి పోలీసులకు అప్పగించారు. కలువాయి గిరిజన కాలనీలో ఉంటున్న సుధయ్యకు చెందిన ఆరు మేకలు చోరీకి గురయ్యాయి. చోరీ చేసిన మేకలను విక్రయించేందుకు దొంగలు సంతకు తీసుకువస్తారని సుధయ్య గూడూరుకు వెళ్లి అక్కడ నిఘా ఉంచాడు. అనుకున్నట్లే కలువాయి మండలం మాదన్నగారిపల్లెకు చెందిన ఇద్దరు వ్యక్తులు మేకలు తీసుకొచ్చి అమ్ముతుండగా గుర్తించి వారిని పోలీసులకు అప్పజెప్పారు. ఎస్‌ఐ సుమన్ కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగి ఉన్న కారును ఢీకొన్న మినీ లారీ

- తప్పిన ప్రమాదం



దెబ్బతిన్న కారు ముందు భాగం

సంగం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సంగం - ముంబయి జాతీయ రహదారి కూడలిలో ఆగి ఉన్న కారును మినీ లారీ ఢీకొన్న సంఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. వివరాల మేరకు.. ఏఎస్‌పేట మండలం శ్రీకొలను గ్రామానికి చెందిన బలరామిరెడ్డి కారులో సంగం వచ్చి తిరిగి వెళ్తుండగా మార్గమధ్యంలో సంగం రహదారి కూడలిలో ఆత్మకూరు - నెల్లూరు వైపు వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో రహదారిని దాటేందుకు కారును సంగం వైపు నిలిపాడు. ఇంతలో నెల్లూరు నుంచి ఆత్మకూరు వైపు వేగంగా వెళ్తున్న మినీ లారీ ఆగి ఉన్న కారును ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం దెబ్బతింది. కారు బెలూన్‌లు ఓపెన్ కావడంతో డ్రైవర్ సీట్‌లో ఉన్న బలరామిరెడ్డికి ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దగుమాటి, ప్రవాస భారతీయులు.

బిట్రగుంట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జక్కేపల్లి గూడూరు పంచాయతీ సోమేశ్వరపురం కామాక్షిదేవి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో బాలసుబ్రహ్మణ్యేస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంను శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఇన్‌చార్జి ఈవో రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఆలయ కలష ప్రతిష్ఠ, శాంతిహోమం చేపట్టారు. ఆలయ నిర్మాణం, ప్రతిష్ఠ కార్యక్రమ దాతలు ప్రవాస భారతీ యులు బచ్చు కృష్ణకుమార్, సంధ్య దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిని ఈవో ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. అమరక్క ఆశయ సాధనకు అమరాబచ్చు ట్రస్ట్ ఏర్పాటు చేసి ఆధ్యాత్మిక, సామాజిక సేవలు చేస్తున్న కృష్ణకుమార్, సంధ్య దంపతులను కొనియాడారు. కార్యక్రమంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ మాజీ పాలక మండలి చైర్మన్ శ్రీరామ్‌మాల్యాద్రి, అర్చకులు సత్యనారా యణచార్యులు, నాగేశ్వరావు, వెంకటేశ్వరరెడ్డి, వెంకయ్య, వేంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, వేంకటేశ్వర్లురెడ్డి, వెంకప్పనాయుడు, గోపికృష్ణ ఉన్నారు.

బ్రహ్మోత్సవాల పనులు ప్రారంభం

కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మార్చి 9నుంచి జరుగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల పనులు శుక్రవారం నుంచి ప్రారంభం అయ్యాయి. అందులో భాగంగా ఈవో రాధాకృష్ణ ఆధ్వర్యంలో అర్చకులు శాస్త్రోక్తంగా పసుపు దంచే కార్యక్రమం నిర్వహించారు.

కలలు కనండి.. సాకారం చేసుకోండి : ఎమ్మెల్యే కాకర్ల


విద్యార్థినికి స్కాలర్‌షిప్ పత్రం అందిస్తున్న కాకర్ల

కలిగిరి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో ప్రతిఒక్కరూ ఉన్నత స్థానానికి ఎదగాలని కలలు కనాలని వాటి సాకారానికి కృషి చేయాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచించారు. శుక్రవారం ఏపీ మోడల్‌స్కూల్ 12వ వార్షికోత్స వంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. విద్యార్థి దశలో ప్రతిఒక్కరూ ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ముందుకు సాగాలన్నారు. సెల్‌ఫోన్, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో విద్యలో రాణించాలని కోరారు. ఈ సందర్భం గా స్కాలర్‌షిప్‌లకు ఎంపికైన విద్యార్థులకు ఎమ్మెల్యే పత్రాలను అందజేశారు. అనంతరం పాఠశాల సిబ్బంది ఎమ్మెల్యేకు ఆయన చిత్రపటాన్ని బహూకరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఏపీ మోడల్‌స్కూల్ సిబ్బంది, విద్యార్థులు ఎమ్మెల్యేతో కలిసి సెల్ఫీలు దిగారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఏ శ్రీనివాసులు పాల్గొన్నారు.

దిల్‌కుషా కుటుంబానికి ఎమ్మెల్యే కాకర్ల పరామర్శ

కొండాపురం: వెలిగండ్లరోడ్డు ప్రమాదంలో మరణించిన గరిమెనపెంట షేక్ దిల్‌కుషా కుటుంబాన్ని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పరామర్శించారు. మృతురాలి భర్త భాషాతో మాట్లాడుతూ కుటుంబానికి అన్నివిధాలుగా ఆదుకుంటామన్నారు. అంతకుముందు చల్లవారిపల్లెలో స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఆయనవెంట నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి యారవ క్రిష్ణయ్య, అల్లిక మధు పాల్గొన్నారు.

యానాదిశెట్టి సేవలు మరవలేనివి

● విగ్రహ శంకుస్థాపనలో పాల్గొన్న కావలి, ఉదయగిరి ఎమ్మెల్యేలు


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కావ్య

కావలి, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): కుల,మత రాజకీయాలకతీతంగా ప్రజాసేవలోనే గడిపిన మహోన్నత వ్యక్తి గ్రంధి యానాదిశెట్టి అని ఆయన కావలి అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మాగుంట పార్వతమ్మ ట్రంకు రోడ్డులోని స్థాని క పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్‌లో గ్రంధి కుటుంబసభ్యుల సమక్షంలో యానాదిశెట్టి కాంస్య విగ్రహ ప్రతిష్ఠకు చేపట్టిన శంకు స్థాపన కార్యక్రమంలో కావలి, ఉదయగిరి ఎమ్మెల్యేలు దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, కాకర్ల సురేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పోతుగంటి అలేఖ్య, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, ఆర్యవైశ్య సంఘం నేతలు గ్రంధి సమకాలికులు పాల్గొన్నారు.

రిసోర్స్ కేంద్రం ప్రారంభం

కావలి టౌన్ : విద్యార్థుల భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం రిసోర్స్ కేంద్రాలు ప్రారంభించినట్లు ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం వెంగళరావునగర్‌లోని బీసీ సంక్షేమ వసతిగృహంలో ఎస్ఆర్ శంకరన్ రిసోర్స్ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇన్‌చార్జి బీసీ సంక్షేమ అధికారి రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకరన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీమేధా జూనియర్ కళాశాల సౌజన్యంతో సమకూర్చిన ప్యాడ్లు, పెన్నులు విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత సంక్షేమ అధికారి సుధాకర్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అలేఖ్య, నేతలు గుత్తికొండ కిషోర్, శ్రీమేధ కరస్పాండెంట్ జానకిరామ్, గంగినేని వెంకటేశ్వర్లునాయుడు, గురుస్వామి, తిరివీది ప్రసాద్, ఆలా శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు కావలి మండల సర్వసభ్య సమావేశం

కావలి రూరల్, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీదేవి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తాగునీరు, పారిశుధ్యం, ఉపాధిహామీ పనల అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించామన్నారు. సమావేశానికి జట్పీటీసీ, ఎంపీటీసీలు, ఆప్షన్ సభ్యుడు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు పాల్గొనాలన్నారు.

ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలి


ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న దాసరిపల్లి గ్రామస్థులు

ఉదయగిరి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసరిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని శుక్రవారం పీఎంసీ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవో షేక్ మస్తాన్‌వలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం 60 మంది విద్యార్థుల కంటే ఎక్కువ ఉన్న పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తోందన్నారు. ప్రస్తుతం తమ పాఠశాలలో 51 మంది మాత్రమే ఉన్నారన్నారు. వచ్చే విద్యాసంవత్సరానికి పాఠశాలలో 100 మంది విద్యార్థులు ఉండేలా చూడడంతోపాటు మౌలిక వసతులు తామే సమకూర్చుకుంటామన్నారు. అందులో భాగంగా తీర్మానం సైతం చేశామన్నారు. 9, 10వ తరగతుల కోసం విద్యార్థులు 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న దుత్తలూరు, ఉదయగిరికి వెళ్లాల్సి వస్తోందని, దీంతో చాలా మంది మధ్యలోనే విద్యకు దూరమవుతున్నామన్నారు. స్పందించిన ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, గ్రామపెద్దలు జాఫర్‌మొహిద్దీన్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

డీలర్‌పై కేసు నమోదు

కావలి రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెంకులఫ్యాక్టరీలోని చౌక దుకాణం నిర్వాహకుడు వంటేరు కొండలరావుపై శుక్రవారం రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. కావలి సీఎస్‌డీటీ విజయమ్మ ఈ దుకాణంను తనిఖీ చేయగా అక్కడ ఉండాల్సిన నిల్వల కంటే అదనంగా బియ్యం 3,565 కేజీలు, కందిపప్పు 19కేజీలు, చక్కర 307 కేజీలు ఉన్న ట్లు సిఎస్‌డీటీ గుర్తించింది. తదుపరి చర్యల నిమిత్తం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపీచంద్ తెలిపారు.

నిరుపయోగంగా వాటర్ ప్లాంట్

● శిథిలావస్థలో వాటర్‌ప్లాంట్ ● తుప్పు పడుతున్న సామగ్రి ● నిరుపయోగంగా ట్రాక్టర్లు, ట్యాంకరు


మూతపడ్డ వాటర్ ప్లాంట్


తుప్పు పడుతున్న యంత్రాలు


నిరుపయోగంగా వాటర్ ట్యాంకరు, ట్రాక్టర్

ఏఎస్ పేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా మారిందని, తాగునీటి కోసం అల్లాడాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. మండల కేంద్రమైన ఏఎస్ పేటతో పాటు సమీపంలోని చందులూరుపాడు, మదారాబాదు, జమ్మవరం, కాకర్లపాడు, చౌటభీమవరం, పెద్దహబ్బీపురం, అనుమసముద్రం, గండువారిపల్లి, పందిపాడు, పోనుగోడు, తెల్లపాడు తదితర 12 గ్రామాలకు మంచి నీరు అందించాలనే ఉద్దేశ్యంతో గండువారిపల్లి గ్రామంలో సుజల స్రవంతి పథకంతో మెయిన్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటుచేశారు. ఇక్కడి నుంచి గ్రామాలకు నీటిని తరలించడానికి 5 ట్యాంకర్లు, ట్రాక్టర్లు ఏర్పాటు చేశారు. దీంతో ఆయా గ్రామల ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా పోయింది. ఈప్లాంట్ ప్రారంభించిన మొదటిలో బాగానే ఉన్నా తరువాత విద్యుత్ బిల్లులు నెలల తరబడి చెల్లించకపోవడంతో ప్లాంట్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అటు అధికారులు, ఇటు పాలకులు పట్టించుకోకపోవడంతో ఏకంగా మూతపడింది.

తుప్పు పడుతున్న లక్షల విలువైన సామగ్రి

వాటర్ ప్లాంట్ మూతపడి సంవత్సరం పైగా కావడంతో నీటిని శుద్ధి చేసే విలువైన యంత్రాలు, సామగ్రి తుప్పు పడుతున్నాయి. అలాగే గ్రామాలకు తరలించాడానికి ఏర్పాటుచేసిన ట్రాక్టర్లు నెలల తరబడి అలాగే ఉండడంతో వాటి టైర్లు పంచరై, ఇంజన్లు తుప్పు పట్టిపోయాయి. నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామాలలో ఏర్పాటుచేసిన స్టీల్ వాటర్ ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. కాగా, అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణా లోపం కారణంగా వాటర్ ప్లాంట్ మూతపడిందని, ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌ల నుంచి నీటిని కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పదించి మూతపడిన వాటర్ ప్లాంట్‌ను వెంటనే పునరుద్ధరించి తాగునీటిని అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రేషన్‌షాపు తనిఖీ

ఆత్మకూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సాధారణ తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఆత్మకూరులోని జెఆర్‌పేటలోని రేషన్‌షాపును తహసీల్దారు వి సుధీర్ తనిఖీ చేశారు. రేషన్‌షాపులోని సరుకులను, స్టాక్ రికార్డులను పరిశీలించారు. ప్రతినెలా క్రమం తప్పకుండా సకాలంలో ప్రజలకు సరుకులు అందించాలని రేషన్ షాపు డీలర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డీటీ ఎండి అజీజుల్లా ఖాన్ పాల్గొన్నారు.

పాడి రైతులకు బీమా సౌకర్యం

కలిగిరి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): హెరిటేజ్ సంస్థ పాడిరైతులకు బీమా సౌక ర్యం కల్పిస్తున్నట్లు హెరిటేజ్ జనరల్ మేనే జర్ నాగఅప్పారావు తెలిపారు. తూర్పు దూబగుంటలో శుక్రవారం హెరిటేజ్ డైరీ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా పాడి రైతులకు పశుపోషణపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం డెయిరీకి పాలు సరఫరా చేసే కుడుమలదిన్నెపాడు పాడిరైతు పాము కాటు చికిత్సకు రూ.40,500, ప్రమాదబీమా రూ.29,416లు అందజేశారు. కార్యక్రమంలో ఏరియా మేనేజరు భాష, కలిగిరి మేనేజర్ కిరణ్, అశోక్, కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

'ప్రకాశం' ఇంజనీరింగ్ కాలేజీకి న్యాక్ ఏ గ్రేడ్

కందుకూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీకి యూజీసీ న్యాక్ ఏ గ్రేడ్‌ను ప్రకటించింది. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో పెద్దఎత్తున సంబరాలు చేసుకుని కేకు కట్‌చేసి సిబ్బందికి పంచిపెట్టారు. కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య మాట్లాడారు. ఇది సమిష్టి కృషి ఫలితమన్నారు. కాఆర్యక్రమంలో టెక్నికల్ డైరక్టర్ విజయ్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, విభాగాధిపతి ముప్పా లక్ష్మణరావు, వైస్ ప్రిన్సిపా ల్ హరిబాబు, ఆయా విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

సీతారామపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగసానిపల్లికి చెందిన గుర్రంకొండు పెద్ద సుబ్బారావు శుక్రవారం తన బంధువుల వివాహ వేడుకలకు పోరుమామిళ్ళకు వెళ్తుండగా నారాయణంపేట సమీపంలోని మలుపు వద్ద బైక్ అదుపు తప్పి డివెడర్‌ని ఢీకొంది. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు ఘన సన్మానం

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలాపురం ఆయుష్మాన్ కేంద్రంలో ఎంపీహెచ్ ఏఎన్ఎంగా విధులు నిర్వర్తిస్తున్న జమాయమ్మ సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. శుక్రవారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో రిపబ్లిక్‌డే సందర్భంగా ఉత్తమ అవార్డు అందుకున్న ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి జ్యోతి, నీటి సంఘం అధ్యక్షుడు అంబటి బ్రహ్మారెడ్డి, హెల్త్ అసిస్టెంట్ మన్సూర్‌అలీ పాల్గొన్నారు.

ఆక్రమిత ఇనాం భూముల్లో విద్యుత్ కనెక్షన్ తొలగించాలి


ఏఈకి వినతి పత్రం అందజేస్తున్న దేవిశెట్టిపల్లి గ్రామస్థులు

సీతారామపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణకు గురైన ప్రభుత్వ ఇనాం భూమిలో విద్యుత్ కనెక్షన్ తొలగించాలంటూ మండల పరిధిలోని దేవిశెట్టిపల్లి గ్రామానికి చెందిన గ్రామస్థులు శుక్రవారం విద్యుత్ ఏఈ శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. దేవిశెట్టిపల్లి గ్రామానికి చెందిన సర్వే నెంబరు 56-3లో 2.36 సెంట్లు భూమి ఇనాం ప్రభుత్వ భూమిగా నమోదై ఉందని, అయితే మారంరెడ్డిపల్లి ఎస్‌సి కాలనీకి చెందిన వ్యక్తి నకిలీ పాసుపుస్తకాలు సృష్టించి ట్రాన్స్‌ఫార్మర్, 3సర్వీసులు పొందాడని, అతని సర్వీసులని, ట్రాన్స్‌ఫార్మర్‌ని వెంటనే తొలగించి అతనిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విద్యుత్ ఏఈకి వినతిపత్రం అందజేశారు.

పాఠశాలను విలీనం చేయవద్దని ఆందోళన


సీతారామపురం: పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

సీతారామపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో గత 40 ఏళ్లుగా ఐదో తరగతి వరకు ఉన్న పాఠశాలలోని 3,4,5 తరగతుల విద్యార్థులను సీతారామపురం గ్రామంలోని బెస్తకాలనీ పాఠశాలలో విలీనం చేయవద్దని శుక్రవారం సీతారామపురం గ్రామపంచాయతీలోని నారాయణంపేట పాఠశాల వద్ద నారాయణం పేట గ్రామవాసులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల భద్రత దృష్ట్యా మా గ్రామ పాఠశాలలోనే ఉంచాలంటూ నిరసన వ్యక్తం చేస్తున్నామని తెలిపారు.

ఉర్దూపాఠశాలను తొలగించవద్దు

అనంతసాగరం : మండలంలోని ముస్తాపురం ఉర్దూ ప్రాథమిక పాఠశాలను తొలగించవద్దని విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం పాఠశాల ముందు ఆందోళన చేశారు. మోడల్ స్కూల్‌లో విలీనం ప్రక్రియను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

●కలువాయి : ఉర్దూ పాఠశాలను వేరే పాఠశాలలో విలీనం చేసేందుకు చేసిన ప్రతిపాదనలకు నిరసనగా స్థానిక ఉర్దూ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం పాఠశాల వద్ద నిరసన తెలిపారు. ఈమేరకు ఎంఈవోకు విన్నతి పత్రం అందజేశారు.

డీవార్మింగ్‌ను విజయవంతం చేయండి


ఉదయగిరి: గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారిణి శివకల్పన, సిబ్బంది

ఉదయగిరి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఈనెల 10వ తేదీన నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారిణి శివకల్పన పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పాత సామాజికఆరోగ్య కేంద్రంలో వైద్యఆరోగ్య సిబ్బందితో కలిసి కార్యక్రమానికి సంబం ధించిన గోడపత్రికలను ఆవిష్కరిం చారు ఈ కార్యక్రమంలో వైద్యఆరోగ్య సిబ్బంది నౌషాద్‌బాబు, వెంకటసుబ్బయ్య, శివకుమారి పాల్గొన్నారు.

●సంగం : మండలంలో డీవార్మింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల అధికారులు శుక్రవారం పిలుపునిచ్చారు. ఈమేరకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో షాలెట్ ఆధ్వర్యంలో డీవార్మింగ్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జానకిరామ్, వైద్యాధికారి డాక్టర్ అశోక్, ఈవోఆర్డీ వరప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రుణాల దరఖాస్తుకు గడువు పెంపు

ఉదయగిరి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తుకు ఈనెల 12వ తేదీ వరకు గడువు పెంచినట్లు ఎంపీడీవో అప్పాజీ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఈనెల 10వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కేంద్ర ప్రభుత్వ సంస్థ సంయుక్త ప్రాంతీయ కేంద్రం వారి ఆధ్వర్యంలో దివ్యాంగులు, వయోవృద్ధుల క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ క్యాంపులో మూడు చక్రాల వాహనాలు, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్‌లు తదితర ఉపకరణాలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కావున అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

న్యాయవాదులు కోర్టు విధుల బహిష్కరణ

కావలి, ఫిబ్రవరి7 (ఆంధ్ర జ్యోతి): కర్నూల్‌లో ఏర్పాటు చేయనున్న హైకోర్టు పర్మినెంట్ బెంచ్ పరిధిలోకి నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని అన్ని కోర్టు లను తీసుకు రావటాన్ని నిరసిస్తూ శుక్రవారం పట్టణం లో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నిర సన తెలిపారు. బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటా సురేంద్రరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. కర్నూలు హైకోర్టు పర్మినెంట్ బెంచీని ఏర్పాటు చేయటం శుభపరిణామం అన్నారు. అయితే ఆ బెంచ్ పరిధిలోకి నెల్లూరు, ప్రకాశం జిల్లాలోని అన్ని కోర్టులను తీసుకరావటం అన్యాయం అన్నారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బార్ అసోసియేషన్ తీర్మానించారు. ఈ విషయంను త్వరలో ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులకు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, హైకోర్టు రిజిష్టర్ జనరల్‌కు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ బాధ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీసుల దాడి

కావలి రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తుమ్మలపెంట పంచాయతీ కొత్తసత్రం బెల్టు దుకాణంపై శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం అమ్మకాలు సాగిస్తున్న పొన్నపూడి శ్రీనును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 10మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ దేవిక, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ



లింగసముద్రం: ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కందుకూరు ఏపీడీ బాబూరావు

లింగసముద్రం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో చేపట్టనున్న ఉపాధిహామీ పను లకు ఎక్కువ మంది కూలీలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ఉపాధిహామీ అసిస్టెంటు ప్రాజెక్టు డైరెక్టర్ బాబూరావు సిబ్బందిని ఆదే శించారు. శుక్రవారం ఆయన లింగ సముద్రం, ఆర్‌ఆర్.పాలెం, మొగిలి చెర్ల లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను తనిఖీ చేసి మస్టర్లను పరిశీలించారు. ప్రతిరోజూ కనీసం నాలుగు గంటలు పని చేస్తే గరిష్ఠంగా రూ.300లు కూలీ డబ్బులు వస్తాయన్నారు. కొలతల ప్రకారం పనులు చేయాలని, సమయపాలన పాటించాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో టీఏలు, ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించి పారంపాండ్‌లు నిర్మించే పనులపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఓ షేక్ సమీర్‌బాషా, టిఏ రాఘవ, జక్రయ్య, శ్రీకాంత్, ఎం జక్రయ్య, ఎఫ్ఏలు సీహెచ్ రమేష్, వెంకటేశ్వర్లు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

● సీతారామపురం : గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధిహామీ పథకం పనులను ఏపీఓ సుభాషిణి శుక్రవారం పరిశీలించారు. అనంతరం మస్టర్లను తనిఖీ చేసి కూలీలకు సూచనలు చేశారు. కొలతల ప్రకారం పనులు చేపట్టి పూర్తిస్థాయి వేతనం పొందాలని, ఉదయం 6.30 గంటల నుంచి 10.30 గంటల్లోపు పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు.

న్యూస్ బాక్స్

హనుమంత వాహనంపై శ్రీవారి వైభోగం


హనుమంత వాహనంపై విహరిస్తున్న కల్యాణ వెంకటేశ్వరస్వామి

కావలిటౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) స్థానిక హనుమత్ క్షేత్రంలోని లక్ష్మీపద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి శుక్రవారం హనుమంత వాహన సేవలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ వ్యవస్థాపక ప్రధాన అర్చకులు వేదగిరి సూర్యనారాయాణా చార్యులు పర్యవేక్షణలో ఉత్సవాలు జరిగాయి. అనంతరం ముసునూరులో నిర్వహించిన గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం తోమల సేవ, హోమం పూజలు, ఉత్సవ మూర్తుల కు విశేష అభిషేకాలు చేపట్టారు. శనివారం శ్రీవారికి గరుడ సేవ నిర్వహించనున్నట్లు అర్చకులు సూర్యనారాయణాచార్యులు తెలిపారు.

పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

ఉలవపాడు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పెద్ద పట్టపుపాలెం ఉన్నత పాఠశాల 11వ వార్షికోత్సవ వేడుకలు ఉల్లాసం, ఉత్సాహాల మధ్య జరుపుకున్నట్లు ప్రధానోపాధ్యాయులు ఎస్‌కే సలీంబాషా తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. 10వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సభ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాకమిటి చైర్మన్ వాయల తిరుపతిరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

బిట్రగుంట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విశ్వనాథరావుపేట ప్లాటినం తెలుగు బాసిస్టు చర్చి (నార్త్) 95వ వార్షికోత్సవం సందర్భంగా రోజర్ శుక్రవారం పేదలకు దుస్తులు పంపిణీ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో పాస్టర్ సీహెచ్.నాగరాజు, సంఘకాపరి రెవ ఎన్.ఎబెనేజర్, చర్చి చైర్మన్ డేవిడ్‌రాజు, కమిటీ సభ్యులు చంద్రహాస్, మనోహర్, మార్క్, అనీల్‌జ్యోషి సంఘం సభ్యులు ఉన్నారు.

ఆర్‌ఎస్‌ఆర్‌లో రక్తదాన శిబిరం

బిట్రగుంట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కడనూతల ఆర్‌ఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఫౌండర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రామిరెడ్డి సుబ్బారెడ్డి జ్ఞాపకార్థం శుక్రవారం కాలేజీలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. నెల్లూరు నారాయణ హాస్పిటల్ వారి సౌజన్యం, ఎన్ఎస్ఎస్ సహకారంతో నిర్వహించిన శిబిరంలో 147 మంది రక్తదానం చేసినట్లు ప్రిన్సిపాల్ పీవీఎన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏవో రమణారెడ్డి, అన్ని విభాగాల అధ్యాపకులు, నా రాయణ హాస్పిటల్ వైద్యులు యసువర్దన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్ ఉన్నారు.

పాఠశాలల్లో మెనూ పాటించాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి సూచించారు. శుక్రవారం పట్టణంలోని దళితవాడ ప్రాథమిక పాఠశా లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల పఠన, అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూశారు.

ట్రక్ ఆటో వర్కర్స్ యూనియన్ ఎంపిక

ఉలవపాడు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రక్ ఆటో వర్కర్స్ యూనియన్ కార్యాలయంను శుక్రవారం ఎస్ఐ అంకమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రక్ ఆటో డ్రైవర్లకు కొన్ని సూచనలిచ్చారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన సరైన ధ్రువీకరణ పత్రాలు, ఇన్సూరెన్స్, డ్రంక్ అండ్ డ్రైవ్ తదితర అంశాలను వివరించారు. 40 మందితో ఏర్పడిన యూనియన్‌లో అధ్యక్ష, ఉపాధ్యక్షుడిగా వెంకటకృష్ణ, కాకు హరిబాబు, ఉపాధ్యక్షులుగా షేక్ ఇస్మాయిల్, కార్యదర్శిగా ఉదయ్ కిరణ్, ఉప కార్యదర్శిగా షేక్ సత్తార్, కోశాధికారిగా రమేష్‌లతో పాటు మరో 9మంది కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

మోడల్ పాఠశాల ఉపాధ్యాయుడికి డాక్టరేట్

కావలిటౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఒట్టూరు మోడల్ పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ఆదాల రాజయ్యకు శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేశారు. ఎస్వీయు ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో తెలుగులో సాహిత్య లేఖలు పరిశీలన అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రెడ్డి, పండిత్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నిమ్మగడ్డ సంపత్ కృష్ణ, ఉపాధ్యాయులు తదితరులు రాజయ్యను అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనంతసాగరం ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవూరు, అనంతసాగరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్న ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ మురళి ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు, ప్రజలు గమనించాలని కోరారు.

నెల్లూరు సిటీ
రూరల్, కోవూరు, సర్వేపల్లి

నేడు భీష్మ ఏకాదశి పూజలు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): భీష్మ ఏకాదశి సందర్భంగా స్థానిక పెద్దూరు శ్రీదేవి, భూదేవి సమేత కోదండరామస్వామి ఆలయంలో లక్ష్మీనరసింహస్వామికి సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహించ నున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం ముందుగా స్వామికి పంచామృతాభిషేకం నిర్వహిస్తామన్నారు.

కామాక్షితాయికి పల్లకీసేవ

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జొన్నవాడ కామాక్షితాయికి శుక్రవారం పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు. ఈ సం దర్భంగా అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకీలో ఉంచి ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం సామూహిక కుంకుమార్చన చేపట్టారు. ఆలయంలో గంగా, కామా క్షి సమేత శ్రీ మల్లికార్జునస్వామికి ఆలయ పురోహితులు ఉమ్మయ్యస్వామి నిత్యకల్యా ణం నిర్వహించారు. భక్తులు తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

బీసీలకు సముచిత స్థానం

● చెముకుల కృష్ణ చైతన్య

విడవలూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల్లో బీసీలకు కూటమి ప్రభుత్వం సముచిత స్థానం కల్పించిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెముకుల కృష్ణ చైతన్య తెలిపారు. శుక్రవారం విడవలూరులో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల్లో 34శాతం రిజర్వేషన్‌ను 24శాతానికి కుదించి బీసీలను వైసీపీ దగా చేసిందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే బీసీలకు 34 శాతం రిజర్వేషన్‌ను నామినేటెడ్ పదవుల్లో కేటాయిస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీ ఇపుడు నెరవేర్చారని హర్షం వ్యక్తం చేశారు.

ఆ జీవో విద్యార్థులపాలిట శాపం

● జనసేన నాయకుడు శ్రీనాథ్

విడవలూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, విద్యా సంస్థల్లో విద్యాపరమైన కార్యక్రమాలు, ప్రభుత్వ కార్యకలాపాలు మినహా క్రీడలు సభలు, సమావేశాలు నిర్వహించరాదని ప్రభుత్వం విడుదల చేసిన జీవో విద్యార్థుల పాలిట శాపంగా మారిందని జనసేన మండలాధ్యక్షుడు కమతం శ్రీనాథ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జీవోతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పవని, ప్రభుత్వం పునరాలోచించి జీవోలో మార్పు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఉపకరణాల పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల అభివృద్ధి కార్యాలయ ఆవరణలో శుక్రవారం కోవూరు ఎమ్మెల్యే 66 మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, వీల్‌చైర్స్, వాకర్లు, టాయిలెట్ సీటరు, వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. నెల్లూరులోని కాంపోసిట్ రీజియనల్, స్కిల్ డెవలప్‌మెంట్ రిహాబిలేషన్ ఎన్‌పవర్‌మెంట్ పర్సన్స్ విత్ డిసాబిలిటీస్, (ఏఎల్ఐఎంసీఓ, పీఎండీకే) సహకారంతో చేపట్టిన కార్యక్రమం లో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజమురళి, వైస్ చైర్మన్లు శివకుమార్‌రెడ్డి, నస్రీన్, కౌన్సిలర్లు, నాయకులు హరికృష్ణ, ఎంవీ.శేషయ్య, రామానాయుడు, ప్రభాకర్‌రెడ్డి, హరనాథ్, తాళ్లస్వామి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

కసుమూరులో భక్తుల రద్దీ

వెంకటాచలం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుమూరు మస్తాన్ వలీ దర్గాలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొం ది. స్థానిక భక్తులే కాకుండా తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతోపాటు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మస్తాన్ స్వామి దర్గాను ప్రత్యేకంగా అలం కరించారు.

బీసీ రుణాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

వెంకటాచలం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్హత కలిగిన లబ్ధిదారులు ఈనెల 12వ తేదీ లోగా బీసీ కార్పొరేషన్ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. స్వయం ఉపాధి యూనిట్ల స్థాపన కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

‘ఖేలో ఇండియా’లో యశస్వినికి రెండు పతకాలు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడు రాష్ట్రం తిరుచురాపల్లిలో జరుగుతున్న సౌత్ ఇండియా, ఖేలో ఇండియా పెన్‌కాక్ సిలాట్ పోటీల్లో నగరానికి చెందిన పొనుగోటి యశస్విని ప్రతిభ చాటుతోంది. ఆంధ్రప్రదేశ్ తరపున శుక్రవా రం పోటీల్లో పాల్గొని రెండు రజత పథకాలు సాధించింది. పెన్‌కాక్ సిలాట్‌లో ఒకటి, తాండింగ్ ఫైటింగ్‌లో మరొక పతకం సొం తం చేసుకుంది.

దీపిక గ్రంథంపై నేడు చర్చా గోష్ఠి

నెల్లూరు (సాంస్కృతికం) : కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ రచన దీపిక పై అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో శనివారం చర్చా ఘోష్టి జరుగుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పెరుగు రామకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 10.30గంటలకు రిత్విక్ ఎన్‌క్లేవ్ లోని శ్రీవెంకటేశ్వర విద్యాలయం దగ్గర జరుగుతుందని, అభ్యుదయ రచయి తలు అందరూ హాజరుకావాలని కోరారు.

పెద్దాసుపత్రిలో దాహం తీర్చే దిక్కేది!

● నెల నుంచి పనిచేయని ఆర్వో ప్లాంట్లు
● మరమ్మతులకు రూ.15 వేలు ఖర్చు చేయని అధికారులు
● తాగునీటి కోసం రోగుల అవస్థలు
● దుకాణాల్లో కొనుక్కుంటున్న వైనం

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకులు దాహంతో అల్లాడుతున్నారు. ఒక వైపు ఎండలు ముదురుతుండటం, మరోవైపు ఆసుపత్రిలో ఆర్వో ప్లాంటు పనిచేయకపోవడంతో తాగునీటి కోసం అవస్థ పడుతున్నారు. గత్యం తరం లేని పరిస్థితుల్లో బయట దుకాణాల్లో నీటి ని కొనుక్కుని గొంతు తడుపుకుంటున్నారు. ఈ ఆసుపత్రికి వచ్చే రోగులు అత్యధికులు పేదలే. తాగునీటి కోసం తమపై రోజుకు సగటున రూ.100 వరకు భారం పడుతోందని వారు వాపోతున్నారు.

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : జీజీహెచ్‌లో కొన్నేళ్ల క్రితం దాతల సహకారంతో ఐదు ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశారు. అయితే అవి నెల రోజుల నుంచి పనిచేయడం లేదు. వీటి మరమ్మత్తులకు కేవలం రూ.15 వేలు ఖర్చు చేస్తే వినియోగంలోకి వస్తాయని అంచనా. అయితే వైద్యాధికారులు చొరవ చూపక పోవడంతో రోగులు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. నిత్యం ఆసుపత్రిలో ఉండే వైద్యాధికారులు తాగునీటి సమస్య తెలియదని చెబుతుండటం గమనార్హం. రోగులకు మౌలిక సదుపాయాల కల్పనలోనూ జీజీహెచ్ అధికారులు విఫలం చెందుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జీజీహెచ్‌లో ప్రతి రోజూ 550 మందికిపైగా రోగులు ఐపీ చికిత్సలు పొందుతుంటారు. ఓపీ రోగుల కింద నిత్యం మరో 1200 మందికిపైగా వస్తుంటారు. సాధారణ వార్డుతోపాటు సర్జికల్ వార్డు, ఎముకల విభాగం, కంటి విభాగం, మానసిక విభాగం వంటి ఎన్నో వార్డులు ఉన్నాయి. ప్రధానంగా ప్రసూతి విభాగంలో ప్రతి రోజూ 200 మంది గర్భవతులు, బాలింతలు చికిత్స పొందుతుంటారు. ఇక్కడకు వచ్చే వారంతా నిరుపేదలే. వారి కోసం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రత్యేకంగా ఆర్వోప్లాంట్ ఏర్పాటు చేశారు. ఇది మరమ్మతుకు గురికాగా రూ.50 వేలు ఖర్చు పెడితే అందుబాటులోకి వస్తుంది. దీనికి మరమ్మత్తు చేయటానికి జీజీహెచ్ నిర్వాహకులు పట్టించుకో క పోవటంతో వారధి ఫౌండేషన్ మరో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. దీని





ప్రసూతి వార్డులో నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంట్, పనిచేయని వాటర్ కూలర్

రిపేరుకు రూ.3వేలు ఖర్చు చేస్తే తాగునీటి కష్టాలు తీరుతాయి. నెల రోజులుగా ఇక్కడ తాగునీటి సమస్య ఉన్నా ఏ అధికారీ పట్టించుకోకపోవడంతో రోగులు, వారి సహాయకులు నీటిని బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది. రోజుకు 5 లీటర్ల చొప్పున సగటున నిత్యం రూ.100 ఖర్చు చేస్తున్నారు. ఆసుపత్రిలో మరో మూడు ఆర్వోప్లాంట్లు ఉన్నా వాటికి మరమ్మత్తులు చేయక పోవటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీజీహెచ్ పాత భవనం వద్ద ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అందుబాటులో ఉంచిన ఆర్వోప్లాంట్ మాత్రమే రోగులకు దిక్కవుతుంది. అయితే ఇక్కడ ఆర్వోప్లాంట్ ఉందనే సమాచారం తెలియక ప్రసూతి వార్డు రోగులు బయట షాపుల్లో నీటిని కొనుగోలు చేస్తున్నారు.

డబ్బులు పెట్టి కొంటున్నాం



మా పిల్లవాడి ఆరోగ్యం బాగాలేకపోతే వారం క్రితం ఈ ఆసుపత్రికి వచ్చాను. ఇక్కడ తాగేనీళ్లు అందుబాటులో లేక పోవటంతో బయట కొనుక్కుంటున్నాం. రోజుకు ఐదు బాటిళ్లు కొనుగోలు చేస్తున్నాం. ప్రతి రోజు రూ.100 తాగునీటికే ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఆసుపత్రిలోనే తాగునీటి సౌకర్యం కల్పిస్తే మాపై ఆర్థిక భారం తీరుతుంది. బయటికెళ్లే సమస్య కూడా ఉండదు.

- శిరీష, నాయుడుపేట

వెంటనే పరిష్కరిస్తా



ఆసుపత్రిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిసింది. ఆర్వో ప్లాంట్లు పనిచేయటం లేదని గుర్తించాం. వాటి మరమ్మత్తుకు వెంటనే ఆదేశాలు ఇస్తున్నాం. మరమ్మత్తులు జరిగిన వెంటనే తాగునీటిని పునరుద్ధరిస్తాం. దాతల ఆశయాలకు అనుగుణంగా ఆర్వోప్లాంట్లు నిర్వహిస్తాం. మరమ్మత్తులకు నిధులు విడుదలయ్యేలా చూస్తాం.

- డాక్టర్ సిద్ధానాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్

సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : ఎమ్మెల్యే ప్రశాంతి

కొడవలూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని షాదీమంజిల్, ప్రభుత్వ హాస్పిటల్‌ను శుక్రవారం సందర్శించారు. అనంతరం రూ.5లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంటు రోడ్డును ప్రారంభించి మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గంలో ఎక్కడ తట్ట మట్టి వేసి రోడ్డు పూడ్చలేదన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో పల్లెలు ప్రగతి పథంలో దూసుకు పోతున్నాయని తెలిపారు. ఈ మండలంలో 7నెలల వ్యవధిలో రూ.6.50కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేశామన్నారు. మరో రూ.1కోటి మిగులు నిధులున్నాయని చెప్పారు. షాదీమంజిల్‌కు ఎంపీ నిధులతో రూ.10లక్షలు మంజూరు చేశారు. స్థానిక నాయకులు గ్రామీణ ప్రాంత సమస్యలపై దృష్టి సారించాలని, అధికారులు, నాయకులు మమేకమై ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో మండల పరిశీలకుడు ముంగమూరు శ్రీహరిరెడ్డి, అధికారులు, ఎంపీడీవో సుబ్బారావు, తహసీల్దారు స్ఫూర్తిరెడ్డి, నాయకులు శేఖర్‌రెడ్డి, కేతు వెంకటరమణరెడ్డి, చెక్క మదన్,జొన్న శివకుమార్, బెజవాడ వంశీకృష్ణరెడ్డి, మందిపాటి ప్రవీణకుమాఆర్‌రెడ్డి పంది శ్రీనివాసు లు, జిలానీబాషా పాల్గొన్నారు.



కొడవలూరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

● **ఇందుకూరుపేట:** బీజేపీ మండలాధ్యక్షుడు కైలాసం శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. గతంలో ఉన్న రింగ్ బస్ సర్వీసులను పునరుద్ధరించాలని కోరారు. ఇరువురు స్పందిస్తూ ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిరమన జనార్ధన్‌రెడ్డి, సీహెచ్ గాంధీ, సతీష్‌రెడ్డి, శివప్రసాద్, అనీల్‌కుమార్, వెంకటశేషయ్య, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ సముదాయానికి భూమిపూజ

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక మార్కెట్ ప్రదేశంలోని స్థలంలో శుక్రవారం నూతన సముదాయ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కార్యక్రమంలో స్థానిక తేజస్వీ డెవలపర్స్ శ్రీనివాసులురెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా పలువురు సమస్యలతో పాటు రామచంద్రాపురంలో హైస్కూలు ఏర్పాటుపై స్థానికులు ఎమ్మెల్యేకి వివరించారు.

సీడీపీవోలకు ప్రీస్కూల్ శిక్షణ

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఐటీసీ మిషన్ సునెహ్రాకల్, ప్రథం, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సీడీపీవోలకు, సూపర్‌వైజర్లకు ప్రీస్కూల్ శిక్షణ కార్యక్రమం నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా పీడీ కార్యాలయం సీడీపీవో అనురాధ పాల్గొన్నారు. సీడీపీవో లక్ష్మీదేవి, సూపర్‌వైజర్ పద్మ, ప్రథం జిల్లా కో ఆర్డినేటర్ అశోక్ కుమారి, టీం స్టేట్ మెంబర్ సత్యనారాయ ణ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అనురాధ

దోమలను లార్వా దశలోనే నివారించాలి : డాక్టర్ హుస్సేనమ్మ

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రాణాంతక దోమల నివారణలో ప్రజలు బాధ్యతగా మెలగాలని జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని కపాడి పాళెంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాల్లోని నీటి నిల్వలను పరిశీలించారు. నిల్వ చేసిన నీరు దోమల ఉత్పత్తి కేంద్రంగా మారుతుందని, వీలైనంత వరకు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. నగరంలో వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయని, ప్రజలు దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమతెరలు, మస్కిటో కాయిల్స్ వినియోగించాలని సూచించారు.

మైత్రి ఫెర్టినెస్ట్ ప్రారంభం

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గోమతి నగర్‌లో ఏర్పాటు చేసిన మైత్రి ఫెర్టినెస్ట్ అడ్వాన్స్ ఫెర్టిలిటీ సెంటర్‌ను శుక్రవారం రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రారంభించారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కూడా పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ పిల్లలు లేని భార్యాభర్తలు సంతానం కలను నెవరేర్చుకునేందుకు ఈ ఫెర్టిలిటీ సెంటర్‌ను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ గుణపాటి మిథిలశ్రీ, పూర్ణిమా గ్యాస్ ఏజెన్సీస్ డైరెక్టర్ గుణపాటి శివకోటారెడ్డి, క్లారిటీ స్కాన్ నిర్వాహకుడు డాక్టర్ వేనాటి ఉమామహేశ్వరరెడ్డి, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫెర్టిలిటీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

స్వచ్ఛ భారత్‌పై చిత్రలేఖన పోటీలు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ భారత్ అంశంపై శుక్రవారం నగరంలోని ఆర్‌ఎస్‌ఆర్ హైస్కూల్‌లో మురిగిపూడి ట్రస్ట్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సంయుక్తంగా చిత్రలేఖన పోటీలు నిర్వహించాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉత్తమ చిత్రాలు గీసిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సతీష్‌కుమార్, బ్యాంకు మేనేజర్ చిరంజీవి, భార్గవి, ప్రజ్ఞ, ఎన్‌సీసీ ఆఫీసర్ బాలబ్రహ్మాచారి, హెచ్‌ఎం మధుసూదన్ పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ డీవార్మింగ్ తప్పనిసరి : నోడల్ అధికారి

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం 104జిల్లా నోడల్ అధికారి పీఎల్.దయాకర్ సందర్శించి వైద్య సిబ్బందికి సూచనలిచ్చారు. సోమవారం తలపెట్టిన జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆల్బెండజోల్ టాబ్లెట్స్, సంబంధించిన మెటీరియల్ అన్ని స్కూల్స్‌కి చేర్చడంపై మెడికల్ ఆఫీసర్ సి.కిషోర్‌కుమార్‌తో చర్చించారు. డీవార్మింగ్ విద్యార్థులందరికీ తప్పనిసరి అని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్ రమా, సతీష్‌బాబు, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్, స్టాఫ్ నర్సులు శివజ్యోతి, రమీజా, హెల్త్ అసిస్టెంట్ మాధవ, ఫార్మసీ ట్రైనీ సుభాషిణీ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుపై అవగాహన సదస్సు

రాపూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): షుగర్, అధిక రక్తపోటు, ఆహారపు అలవాట్లు గుండెపోటుకు దారి తీస్తున్నాయని రాపూరు సీహెచ్‌సీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సరస్వతి తెలిపారు. శుక్రవారం సామాజిక ఆరోగ్య కేంద్రంలో గుండెపోటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎవరైనా గుండెపోటుకు గురైతే మొదటి గంటలోనే ఆసుపత్రికి చేరుకోవాలని, వెంటనే హబ్ అండ్ స్పోక్ పద్ధతిలో గుండె వైద్యుల సలహా మేరకు అవసరమైన ఇంజక్షన్‌ను ఉచితంగా ఇవ్వడం ద్వారా ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పూడికతీత ప్రారంభం

పొదలకూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కేఆర్ నగర్ నుంచి ప్రారంభమయ్యే ప్రధాన వరవ కాలువలో పూడికతీత పనులను శుక్రవారం ప్రారంభించారు. రూ.4.5లక్షలతో ఈ పనులు నిర్వహిస్తున్నట్లు, త్వరలోనే పూర్తి చేస్తామని టీడీపీ జిల్లా మైనారిటీ నాయకుడు జమీర్‌బాషా తెలిపారు.



గ్రంథాలయ ఉద్యోగుల సంఘం క్యాలెండరు ఆవిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రంథాల య సంస్థ నెల్లూరు ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండరు ఆవిష్కరణ శుక్రవారం నగరంలోని ఎన్జీవో భవన్‌లో జరిగింది. సంఘం అధ్యక్షుడు విజయచంద్ర మాట్లాడుతూ 010 సమస్య, సిబ్బంది కొరత, పదో న్నతుల సమస్యలను జిల్లా ఎన్జీవో నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ మాట్లాడుతూ ఈ సమస్యలపై ఎన్జీవో సంఘాల సమావేశంలో తీర్మానాలు చేసి ప్రభుత్వానికి, జేఏసీకి పంపుతామని తెలిపారు.

డిప్యూటీ సీఎం కోలుకోవాలని పూజలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ అనారోగ్యం నుంచి త్వరగా కోలుకుని, ప్రజలకు మరెన్నో సేవలు అందించాలని కోరుకుంటూ జనసేన పార్టీ నాయకులు శుక్రవారం టెక్కేమిట్ట వీరాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేశారు. 101 టెంకాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిషోర్, సుందరామిరెడ్డి, అనుదీప్, కరీం తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న జనసేన పార్టీ నాయకులు

ఏపీలో అంగన్‌వాడీల స్థితి ఏమిటి?: ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జిల్లాల వారీగా అంగన్‌వాడీల ప్రస్తుత స్థితిని వివరించాలని శుక్రవారం పార్లమెంటులో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ దేశంలోని 18 రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో నివసిస్తున్న 75 గిరిజన తెగల సంక్షేమాభివృద్ధిని దృష్టి లో పెట్టుకుని ప్రధానమంత్రి జనజాతి ఆదివాసి న్యాయ మహాఅభియాన్ మిషన్ రూపొందించిందన్నారు. 2023 - 24, 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో 2500 అంగన్‌వాడీ కేంద్రాలను మంజూరు చేసిందని తెలిపా రు. ఒక్కో అంగన్‌వాడీ కేంద్రాన్ని రూ.12లక్షల వ్యయంతో నిర్మిస్తున్నామని చెప్పారు.

అన్నయ్య చౌదరికి వెంకయ్య నాయుడు నివాళి

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి7, (ఆంధ్రజ్యోతి) : భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు తన చిరకాల మిత్రుడైన మద్దినేని అన్నయ్య చౌదరి మరణంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ నివాళి అర్పించారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలోని వెంకయ్య నాయుడు కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. అంతక ముందు అన్నయ్య చౌదరి కుటుంబ సభ్యులతో ఫోన్ ద్వారా మాట్లాడి సానుభూతి తెలిపారు. తాను పార్టీ కార్యకర్తగా, క్రమశిక్షణ కలిగిన వ్యక్తిగా ఎదగడానికి అన్నయ్య చౌదరి ఎంతగానో దోహదపడ్డారని గుర్తు చేసుకున్నారు. నాటి నుంచి రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి అన్నయ్య కృషి చేశారని కొనియాడారు. కాగా, నెల్లూరు రూరల్లోని నరుకూరు కూడలి వద్దనున్న ఆదిశంకర నాయుడు తోటలో అన్నయ్య చౌదరి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆయన ఇంటికి వెళ్లి నివాళి అర్పించారు.

నాణ్యతలో రాజీ వద్దు : కోటంరెడ్డి

నెల్లూరురూరల్, ఫిబ్రవరి7, (ఆంధ్రజ్యోతి) : తన నియోజకవర్గంలో శర వేగంగా జరుగుతున్న అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో అధికారులు రాజీపడొద్దని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆదేశించారు. కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులతో శుక్రవారం నెల్లూరులోని తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సీసీరోడ్లు, డ్రైన్లు, ఇతర నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని, వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. కాగా, రూరల్ మండలంలోని ఆమంచర్లలో టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి గడప గడప కార్యక్రమాన్ని కొనసాగించారు.

వైభవంగా నాగశిలల ప్రతిష్ఠ

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అయ్యప్పగుడిలో శుక్రవారం నాగరాజు, నాగలక్ష్మి శిలల పునః ప్రతిష్ఠ ఉత్సవం వైభవంగా జరిగింది. అలాగే దేవస్థానం వార్షిక ప్రతిష్ఠాపన దినోత్సవాన్ని కేరళ సంప్రదాయానుసారం నిర్వహించారు. ఆలయ చైర్మన్ జీ శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కే జీ శంకర్, పీటీ జగన్నాథం, పావళ్ల ప్రసాద్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

నెల్లూరు (జడ్పీ, ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్‌పరిధిలో లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 మధ్యాహ్నం 12గంటల వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఈఈ ఎం.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. పుట్టా ఎస్టేట్, పొర్లుకట్ట, మనమసిద్దినగర్, ఉయ్యాలకాలువ కట్ట, రాజేంద్రనగర్‌లో సరఫరా ఉండదన్నారు.

బస్టాండా.. ఆటోస్టాండా!

● ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

పొదలకూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పంచాయతీ బస్టాండ్‌లో ప్రైవేటు వాహనాలు, ఆటోల హవా కొనసాగుతోంది. పొదలకూరుతోపాటు, చుట్టుపక్కల మండలాలైన సోమశిల, పెంచలకోన, కలువాయి, చేజర్ల, రాపూరు, మనుబోలు, సంగం ప్రాంతాల నుంచి పొదలకూరు మీదుగా ప్రయాణికులు వేల సంఖ్యలో నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఆయా ప్రాంతాలకు ప్రయాణికులు స్థానిక పంచాయతీ బస్టాండ్ నుంచి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలు సాగిస్తుంటారు. కాగా, పంచాయతీ బస్టాండ్ ఆవరణలో బస్సులు ఆగేందుకు వీలులేకుండా ఆటోవాలాలు రెచ్చిపోతున్నారు. కనీసం ఆర్టీసీ డిపోకు సంబంధించిన సిబ్బంది ఆటోవాలాల దోపిడీని అరికట్టి ఆర్టీసీకి మరింత ఆదాయం చేకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.




ఇది పనిచేసేది ఎప్పుడు?

● నిరుపయోగంగా ట్రాన్స్‌ఫార్మర్
● నీరందక ఎండుతున్న వరి పంట

పొదలకూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేదురుపల్లి గ్రామంలో గత పదిరోజులుగా ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో వరి పైరు ఎండిపోతోందని గ్రామానికి చెందిన రైతులు కర్లం చంద్రమౌళీ, పెంచలయ్య, కొమ్మి పెంచలయ్య, కోవూరు పెంచలయ్యతోపాటు మరికొందరు రైతులు తెలిపారు. నేదురుపల్లిలో దాదాపు 200 ఎకరాలకు ఉడుం వాగు నుంచి 20 మోటార్లతో వరి పొలాలకు నీరు పెడుతుంటామని, పది రోజులుగా వెలుకంటిపాలెం దగ్గర ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో తమ మోటార్లు ఆడడంలేదని, దీంతో పంట ఎండిపోతోందని రైతులు వాపోతున్నారు. పొదలకూరు మండల విద్యుత్ అధికారులకు తమ సమస్యను చెప్పినా వారు స్పందించడం లేదని, కొన్ని రోజులు ఇలానే ఉంటే పంట పూర్తిస్థాయిలో ఎండిపోయే అవకాశం ఉందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు వెంటనే మరమ్మతులు చేయాలని, అలాగే అనధికారికంగా ఉన్న విద్యుత్ మోటార్లను తొలగించాలని వారు డిమాండ్ చేశారు.





ట్రబుల్ షూటర్స్

తిరుపతి కార్పొరేషన్‌లో ఒకే ఒక్కడిని డిప్యూటీ మేయర్‌గా గెలిపించిన ఆధునిక చాణక్యులు

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్నది ఒకే ఒక్క సీటు.
అయినా డిప్యూటీ మేయర్ పదవిని సొంతం చేసుకున్నారు. ఇదో అనూహ్య పరిణామం. రాజకీయాల్లో కీలకం వ్యూహం. పైకి ఎవరికి వారేగా కనిపించినా అవసర సమయాల్లో తిరుపతి కూటమి నేతలంతా ఒక్కటే అని నిరూపించిన సందర్భం. దౌర్జన్యపు రాజకీయ జెండాను ఐదేళ్లు తిరుగులేకుండా ఎగరేసిన వైసీపీకి దిమ్మతిరిగే సమాధానం ఈ విజయం. ఎలా సాధ్యం? దీని వెనుక ఎవరు కీలకం? తిరుపతి కూటమికి ప్రతిష్ఠాత్మకం. గెలుచుకుని తీరాల్సిందే అంటూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సారథ్యంలో రంగంలోకి దిగారు ట్రబుల్‌షూటర్స్. ఐదేళ్లు.. వైసీపీ వేసిన దారులే వారిని నడిపించాయి. వారు నేర్పిన విద్యను వారి మీదే ప్రయోగించారు. ఒకే ఒక్కడిని గెలిపించి చూపించారు. ఆ ట్రబుల్ షూటర్స్ కథాకమామిషూ.. చదవండి 6లో

హైకోర్టు సీజేకి ఘనస్వాగతం

రేణిగుంట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట విమానాశ్రయంలో శుక్రవారం సాయంత్రం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్‌కు ఘన స్వాగతం లభించింది. మదనపల్లె, పలమనేరులో నూతనంగా నిర్మించిన కోర్టులను ప్రారంభించేందుకుగాను ఆయన వచ్చారు. విమానాశ్రయం వద్ద సీజేకి జేసీ శుభం బన్సల్, తిరుపతి మూడో ఏడీజీ కోర్టు న్యాయమూర్తి ఎం.గుర్నాథ్, ప్రొటోకాల్ జడ్జి కోటేశ్వరరావు, కోర్టు సూపరింటెండెంట్ ధనంజయులు నాయుడు, తిరుపతి బార్ కౌన్సిల్ సభ్యులు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన మదనపల్లెకు బయలుదేరి వెళ్లారు.



శ్రీకాళహస్తి పరిధిలో ఓ గ్రావెల్ మాఫియా చెలరేగిపోతోంది. అధికారుల తెరచాటు సహకారంతో రాత్రి, పగలు గ్రావెల్‌ను తవ్వేస్తోంది. తొట్టంబేడు మండలం శివనాథపాళెం పరిధిలో చేపట్టిన ఈ అక్రమ గ్రావెల్ తవ్వకం... అక్రమార్కులకు రూ.కోట్లు కురిపిస్తోంది.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

శ్రీకాళహస్తిలో

మట్టి దొంగలు



శివనాథపాళెం చెరువులో వేసిన అక్రమార్కులు వేసిన రోడ్డు

శ్రీకాళహస్తి పట్టణంలో గ్రావెల్‌కు మంచి డిమాండ్ ఉంది. ఇళ్ల నిర్మాణానికి, రియల్‌ఎస్టేట్ వెంచర్లకు, లోతట్టు స్థలాలను ఎత్తు లేపుకునేందుకు కొంటున్నారు. అలాగే శ్రీసిటీ, రేణిగుంట, ఏర్పేడు, చెన్నై ప్రాంతాలకూ కొందరు అక్రమార్కులు గ్రావెల్‌ను తరలిస్తున్నారు. శ్రీకాళహస్తి శివారు చెన్నై రోడ్డులోని ఓ పెట్రోల్ బంకు పక్కన గ్రావెల్ మాఫియా ఒక ముఠాగా ఏర్పడి ఆరు నెలల క్రితం కార్యాలయాన్నీ ఏర్పాటు చేసుకుంది. ఆ కార్యాలయం వెనుకనే రెండు నెలల క్రితం భారీ ఇసుక డంప్‌ను అధికారులు సీజ్ చేశారు. అప్పటి వరకు చెన్నైకి ఇసుక తరలిస్తున్న ఆ ముఠా.. తర్వాత గ్రావెల్‌పైపు దృష్టి పెట్టింది. తొట్టంబేడు మండలం శివనాథపాళెం పరిధిలోని భూములను తవ్వకాలకు ఎంపిక చేసుకుంది. ఇక్కడే తెలుగుగంగ కాలువ కట్టకు ఆనుకుని శివనాథపాళెం చెరువు ఉంది. మూడేళ్ల కిందట జాతీయ రహదారి నిర్మాణానికి శివనాథపాళెంలో గ్రావెల్ తవ్వుకోవడానికి సంబంధిత సంస్థ ప్రభుత్వం నుంచి అనుమతి పొందింది. అప్పటి వైసీపీ నాయకులు ఆ సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా చెరువులో వాహనాల రాకపోకలకు అనుమతించారు. అప్పట్లో ఆ సంస్థ చెరువులో తాత్కాలిక బాటను వేసుకుంది. వారి కాలపరిమితి ముగియడంతో అధికారులు చెరువులో బాటకు కందకాలు తవ్వి అడ్డుకట్ట వేశారు. వర్షాలతో చెరువులో బాటా కనుమరుగైంది. రెండు నెలల క్రితం గ్రావెల్ మాఫియా కళ్లు శివనాథపాళెంపై పడ్డాయి. చెరువులో పాతబాటపై భారీ లారీలు తిరిగేలా అనధికారికంగా రోడ్డు వేసుకున్నారు. చెరువు నుంచి ఆ పక్కనే ఉన్న పొలాల్లోకి వెళ్లి గ్రావెల్ తవ్వేసి రోజూ లక్షలాది రూపాయలకు అమ్మి సొమ్ము చేసుకోవడం ప్రారంభించారు.



శివనాథపాళెంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిగిన దృశ్యం

రెండు నెలల్లో 20 ఎకరాల్లో తవ్వేశారు

నీలగిరి తైలం చెట్ల మధ్యలో బీడు భూములు ఉన్నాయి. ఎవరి కంటా పడకుండా గ్రావెల్ తవ్వేందుకు పక్కాగా పథకం రచించారు. ఆ ప్రకారం రాత్రి పది నుంచి వేకువజామున 5గంటల వరకు యంత్రాలతో లారీలు, ట్రాక్టర్లకు తవ్వి నింపి పంపించేవారు. ఇలా రెండు నెలల నుంచి సుమారు 20 ఎకరాల్లో గ్రావెల్‌ను తవ్వేశారు. కొందరు అధికారులు వీరికి అండగా నిలిచారన్న ఆరోపణలున్నాయి. కొందరు అక్రమార్కులు, అధికారులు కలిసి చేస్తున్న ఆగడాలతో కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే ప్రమాదం ఉంది. ఇటీవల వారం రోజులుగా శివనాథపాళెం పరిసర గ్రామాల ప్రజలు గ్రావెల్ మాఫియాపై అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి శివనాథపాళెం, చిట్టత్తూరు, తెల్లరాళ్ల మిట్ట గ్రామాల్లో గ్రావెల్ మాఫియా తవ్వకాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కరాటే, తైక్వాండో

శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కరాటే, తైక్వాండో స్వీయ రక్షణ కళల్లో శిక్షణ ఇచ్చేందుకుగాను శిక్షకులనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కేవీఎన్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్ కార్యక్రమంలో భాగంగా 141 ప్రాథమికోన్నత పాఠశాలల్లోని 2,458 విద్యార్థినులకు, 318 ఉన్నత పాఠశాలల్లోని 30,935 మంది విద్యార్థినులకు 20 సెషన్లుగా కరాటే, తైక్వాండోలో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. సంబంధిత ట్రస్ట్‌లు, సొసైటీల్లో రిజిస్టర్ అయినవారు, శిక్షణలో కనీసం మూడేళ్ల అనుభవం కలవారు 11వ తేదీ మధ్యాహ్నంలోపు దరఖాస్తు చేసుకోవాలి. ఇతర వివరాలకోసం కలెక్టరేట్‌లోని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ కార్యాలయంలో సంప్రదించాలి' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆ ఎక్స్‌కవేటర్‌ను తప్పించింది ఎవరు?

- ఇసుక అక్రమ రవాణాపై అధికారుల దాడులు
- ఐదు ట్రాక్టర్ల సీజ్

చంద్రగిరి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖిలో ఇసుక తవ్వి ట్రాక్టర్లకు పోస్తున్న ఎక్స్‌కవేటర్‌ను పట్టుకున్నాక.. తప్పించింది ఎవరు? పోలీసులా లేదా రెవెన్యూ సిబ్బందా అనేది చర్చనీయాంశంగా మారింది. దీనిపై అధికారులు విచారణ చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి.



చంద్రగిరి మండలంలోని తొండవాడ నుంచి నరసింగాపురం వరకు స్వర్ణముఖినదిలో రాత్రింబవళ్లు ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. దీంతో గురువారం తహసీల్దార్ శివరామసుబ్బయ్య రెవెన్యూ, పోలీసులతో సంయుక్తంగా బృందాలు ఏర్పాటు చేశారు. కాగా, గురువారం రాత్రి చంద్రగిరి బ్రహ్మంగారిగుడి వద్ద భారీగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు తహసీల్దార్‌కి సమాచారం వచ్చింది. రెవెన్యూ బృందం, పోలీసులు కలిసి రాత్రి 11 గంటల సమయంలో దాడులు నిర్వహించారు. ఐదు ఇసుక ట్రాక్టర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను పట్టుకున్నారు. స్వర్ణముఖి నది నుంచి పోలీస్ స్టేషన్‌కు వాహనాలను తీసుకెళ్లే క్రమంలో ఎక్స్‌కవేటర్‌ను కొందరు తప్పించారు. దీనిపై తహసీల్దార్‌ను వివరణ కోరగా ఐదు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి, పోలీసులకు అప్పగించామన్నారు. ఎక్స్‌కవేటర్‌ను పోలీసులు తప్పించారా లేదా రెవెన్యూ సిబ్బందా అనేది విచారిస్తున్నామన్నారు.

హెల్మెట్ లేకుంటే నో ఎంట్రీ

● కార్మికులకు నిప్పో పరిశ్రమ నిబంధన



హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపే కార్మికులను విధుల్లోకి అనుమతించబోమని తడ మండలంలోని నిప్పో పరిశ్రమ యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ మేరకు పరిశ్రమ ప్రధాన గేటు వద్ద నోటీసులు అంటించింది. రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా మృత్యువాత పడుతున్న నేపథ్యంలో కార్మికుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని యాజమాన్యం పేర్కొంది. ద్విచక్ర వాహనాలు నడిపే కార్మికులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించింది.

- తడ, ఆంధ్రజ్యోతి

నైమిశారణ్యంలో వైభవంగా శ్రీవారి కల్యాణం, చక్రస్నానం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుమల, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళా సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని నైమిశారణ్యంలోని బాలాజీ ఆలయంలో శుక్రవారం ఉదయం శ్రీనివాస కల్యాణాన్ని టీటీడీ వైభవంగా నిర్వహించింది. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు కృష్ణశేషాచల దీక్షితులు ఆధ్వర్యంలో అర్చకబృందం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారిని కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చి విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కంకణధారణ, అగ్నిప్రతిష్ఠాపన, యజమాని సంకల్పం, భక్తసంకల్పం, మహా సంకల్పం, మాంగళ్యపూజ, మంగళ సూత్రధారణ వంటి ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అలాగే, గోమతి నదీ తీరంలో శుక్రవారం చక్రస్నానాన్ని నిర్వహించారు. నదీతీరంలో చక్రత్తాళ్వార్లకు పాలు, పెరుగు, తేనె, చందనంతో అర్చకులు అభిషేకం చేశారు.


శ్రీహరి సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.23 కోట్లు


గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,908

తలనీలాలు సమర్పించినవారు: 19,549



తిరుపతి డిప్యూటీ మేయర్‌గా ఆర్సీ మునికృష్ణ ఎన్నిక వైసీపీ రాజకీయ నైజాన్ని ఎరిగిన అందరినీ ఆశ్చర్య చకితులను చేసింది. దబాయింపులకు తగ్గకుండా, బెదిరింపులకు లొంగకుండా వైసీపీ జెండాతో కార్పొరేటర్లుగా గెలిచిన ఇంత మందిని ఎలా కూడగట్టగలిగారన్నదే చర్చగా మారింది. 'రాష్ట్రంలో అధికారం మనదైనా.. తిరుపతి కార్పొరేషన్‌లో అంతా వాళ్లే.. అబ్బే.. అసాధ్యం' అనుకుంటున్న సమయంలో ట్రబుల్ షూటర్స్ రంగంలోకి దిగారు. వ్యూహ నైపుణ్యాలను వెలికి తీశారు. గెలిపించి .. వైసీపీని దడిపించి చూపించారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



కూటమిలో ట్రబుల్ షూటర్స్

యూత్ పవర్.. జేబీ

బయట ఎక్కడా కనిపించకపోయినా డిప్యూటీ మేయర్‌గా టీడీపీ ఒకే ఒక్కడు ఆర్సీ మునికృష్ణను గెలిపించుకోవడంలో కీలక పాత్ర పోషించారు జేబీ. రియల్‌ఎస్టేట్ రంగంలో ఉన్న జేబీ శ్రీనివాస్.. రాజకీయాల్లోనూ సమాంతరంగా ప్రయాణిస్తున్నారు. ఎటువంటి పరిస్థితుల్లో అయినా ఆయనను వెన్నంటి ఉండే యూత్ జేబీ బలం. క్లిష్ట పరిస్థితుల్లోనూ అనాయాసంగా పనిని చక్కదిద్దగల సామర్థ్యం ఆయనది. దివంగత ఎమ్మెల్యే వెంకటరమణ టీడీపీలోకి వచ్చిన తర్వాత ఎన్నికల సమయంలో ఆయనకు అండగా యూత్ ఫోర్స్‌ను దించేవాడు. ప్రత్యర్థి పార్టీలకు దీటుగా నిలబడి వ్యూహాలు రచించడంలోనూ, పోల్ మేనేజ్‌మెంట్ చేయడంలోనూ గట్టి పట్టుంది. 2019 ఎన్నికల్లో కొర్లగుంట, జీవకోన ప్రాంతాల్లో టీడీపీకి జనరల్ ఏజెంట్‌గా పనిచేసిన జేబీ వర్గం వైసీపీ దౌర్జన్యాలను నిలువరించగలిగింది. ఈ బూత్‌ల్లో వైసీపీకి మెజారిటీ తగ్గిపోవడంతో ఆ తర్వాత అక్రమ కేసుల్లో ఇరికించారు. తిరుపతి అసెంబ్లీ టికెట్ ఆశించినవారిలో జేబీ కూడా ఉన్నారు. వైసీపీ పట్ల అసంతృప్తితో ఉన్న కార్పొరేటర్లను కూటమివైపునకు మళ్లించడంలో ఈయన పాత్ర చాలానే ఉంది. జేబీ యూత్ ఫోర్స్ బలమేమిటో నిరూపించారు.

'పెదబ్బ' దెబ్బకు పెడబొబ్బ

తిరుపతి రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన కుటుంబం ప్రతినిధిగా మబ్బు దేవనారాయణరెడ్డి (పెదబ్బ)కి ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. వెరపు ఎరగని నైజం ఆయనది. ముఖాన నవ్వు చెరగకుండానే పరిస్థితులను అదుపులోకి తెచ్చుకోగల చాతుర్యం ఆయన సొంతం. మున్సిపల్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమి చెందినా మబ్బు పెదబ్బ పేరు నగరంలో మోగుతూనే ఉంటుంది. మబ్బు యువసేన పేరుతో పెద్ద బలగమే ఉంది. తిరుపతి స్థానికుల్లో ఆయనకున్న స్నేహ, బంధుత్వాలే ఆయన బలం. తిరుపతిలో వైసీపీ సై అంటే.. సై అనగల దమ్మున్న నాయకుడిగా గుర్తింపు ఉంది. 2019 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన పెదబ్బ గత ఎన్నికల్లో తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో కూటమి విజయానికి మనసుపెట్టి పనిచేశారు. తాజాగా తిరుపతిలో జరిగిన డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో ఆచితూచి అడుగులేస్తూ వైసీపీకి ధాటీగానే సమాధానం ఇచ్చారు.

తెరవెనుక ఎన్వీ ప్రసాద్

తిరుపతి డిప్యూటీ మేయర్‌ను టీడీపీకి టర్న్ చేయడంలో ప్రధాన వ్యూహకర్త తుడా మాజీ చైర్మన్ ఎన్వీ ప్రసాద్. తెరవెనుక నుంచే కథ మొత్తం నడిపారు. తన ప్రధాన అనుచరుడు ఆర్సీ మునికృష్ణను డిప్యూటీ పీఠంపై కూర్చోబెట్టారు. ఎన్వీ ప్రసాద్ ఎన్నికల స్ట్రాటజీపై స్థానిక రాజకీయనాయకులు ప్రత్యేకంగా చెప్పుకుంటుంటారు. తన సినిమాను బ్లాక్‌బస్టర్ చేసేందుకు ఎంత శ్రమిస్తారో, ఎన్నిక క్రతువును తనవైపు తిప్పుకునేందుకు అంతే కష్టపడతారన్న పేరుంది. డిప్యూటీ మేయర్ ఎన్నిక నోటిఫికేషన్ వచ్చినప్పటినుంచి ఆయన సినిమా థియేటర్‌లోని తన ఆఫీస్‌కే పరిమితమైపోయినట్టు కనిపించినా అక్కడి నుంచే చక్రం తిప్పారు. ఆయనకు మరో ముఖ్య అనుచరుడు కార్పొరేటర్ నరసింహాచారి, యువ కార్పొరేటర్ నరేంద్రనాథ్‌ల శ్రమ, సహకారం కీలకమైనవి. కూటమివైపు నిలబడే వారి సంఖ్యను మూడు నెలల క్రితమే ఆ సంఖ్యను 16కు చేర్చారు. వైసీపీ స్థానిక నాయకత్వంపై ఉన్న అసంతృప్తిని కూటమికి అనుకూలంగా మార్చుకోవడంల ఎన్వీ ప్రసాద్ పాత్ర ప్రత్యేకమైనదిగా కూటమి శ్రేణులు చెప్పుకుంటున్నారు.

రవినాయుడు లాస్ట్ పంచ్

నిన్నమొన్నటి దాకా చేతిలో పుస్తకంతో యూనివర్సిటీలో కనిపించిన ఇతనేనా అని అందరూ ఆశ్చర్యపోతున్నారు అనిమిని రవినాయుడును చూసి ఇప్పుడు. రాష్ట్ర సమస్యల మీద మీడియాలో స్పందించే విద్యార్థి నాయకుడిగా మొదలైన రవినాయుడి రాజకీయ జీవితం లోకేశ్ పాదయాత్రతో కీలక మలుపు తీసుకుంది. కుప్పం నుంచి నెల్లిమర్ల దాకా యువగళానికి రక్షా కవచంలా యువసైన్యాన్ని నడిపించిన సారధిగా గుర్తింపు తెచ్చుకున్నారు. నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి', హలో లోకేశ్.. సభల నిర్వహణ బాధ్యతను సమర్థంగా నిర్వహించారు. సీనియర్లున్నా శాప్‌చైర్మన్ పదవి వరించి వచ్చింది ఈ కారణాలవల్లే. తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నికలో ఆఖరి రోజున ఆయన అనుసరించిన వ్యూహ నైపుణ్యాలు వైసీపీ అంచనాలకు అందలేదు. చాపకిందనే అంతా చక్కబెట్టేశారు.

వీరు సైతం...

డిప్యూటీ మేయర్ ఎన్నిక టీడీపీ వశం కావడానికి ట్రబుల్ షూటర్స్‌కు సమన్వయంగా మరికొంతమంది సహకరించారు. ముఖ్యంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కుమారుడు ఆరణి మదన్. ఎమ్మెల్యే వాయిస్‌గా మదన్ అన్ని సందర్భాల్లోనూ చకచకా నిర్ణయాలు తీసుకుంటూ చురుగ్గా వ్యవహరించారు. కార్పొరేటర్లను శిబిరాలకు తరలించడం, వారి యోగక్షేమాల దాకా బాధ్యతగా చూసుకున్న మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్‌లు శ్రమను కూటమి నాయకత్వం ప్రశంసిస్తోంది.

'అన్నా' లెక్కలే వేరు

జీవకోన అనగానే అన్నా పేరు వినిపిస్తుంది. అధికారంలో ఎవరున్నా ఆ ప్రాంతం మీద పట్టు మాత్రం అన్నా రామచంద్రయ్యదే అన్నంతగా జీవకోనతో పెనవేసుకుపోయారు. తన వారసురాలిగా కుమార్తె అన్నా అనితను కార్పొరేటర్‌గా గెలిపించుకున్నారు. వైసీపీలో తీవ్ర అనాదరణకు గురైన ఆయన ఆ తర్వాత అదను చూసి అడుగులు కదిపారు. కుమార్తె అన్నా అనితను మేయర్ పీఠంపై కూర్చోబెట్టాలనే లక్ష్యం పెట్టుకున్నారు. డిప్యూటీ మేయర్ ఎన్నికలో అన్నా సత్తా ఏమిటో చూపించారు. జాతీయ రాజకీయ పరిణామాలూ.. బీసీలకు జరుగుతున్న అన్యాయంపై అనర్గళంగా మాట్లాడగలగడం ఆయన బలం. యాదవసామాజికవర్గంలో పట్టున్న నాయకుడు. వ్యయప్రయాసలకు వెనుదీయకుండా డిప్యూటీ ఎన్నికలో కృషి చేశారు.

బదిలీ చేసినా కదలరంతే!

● సదరన్ డిస్కం విద్యుత్ సర్కిల్‌లో ఇదీ సంగతి

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బదిలీ ఉత్తర్వులు అందుకున్న వారం రోజుల్లోపు రిలీవ్ కావాలి. ఇదీ నిబంధన. కానీ సదరన్ డిస్కం పరిధిలో కొందరు దీనిని అతిక్రమిస్తున్నారు. గతేడాది సెప్టెంబరు 22వ తేదీన బదిలీ చేసినా.. ఇప్పటికీ రిలీవ్ కాలేదు. పాత స్థానాల్లోనే కొనసాగుతున్నారు. తిరుపతి విద్యుత్ సర్కిల్‌లోని ఆయా కార్యాలయాలతో పాటు ఆపరేషన్ విభాగంలో దీర్ఘకాలంగా ఉన్న వారిని గతేడాది సెప్టెంబరు 22న కార్పొరేట్ కార్యాలయ అధికారులు బదిలీ చేశారు. కొన్ని సంఘాల్లోని వారు ఎక్కువ మంది బదిలీ అయ్యారు. కొందరు మాత్రం పాత స్థానాల్లోనే కొనసాగుతూ.. డివిజన్, సర్కిల్ స్థాయి అధికారుల వద్దకు వెళ్లి తమను రిలీవ్ చేయకుండా చూడాలని కోరినట్లు సమాచారం. కొందరు అధికారులు నోటి మాటతో వీరి బదిలీని అడ్డుకుంటున్నారన్న విమర్శలు ఉద్యోగ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. అప్పటికప్పుడే కొందరిని రిలీవ్ చేసిన అధికారులు.. మిగతావారి విషయంలో చూసీచూడనట్లు ఉండటం గమనార్హం. ఇలా ఉమ్మడి జిల్లాలో బదిలీ ఉత్తర్వులు అందుకున్న వారిలో 10 మందికి పైగా మౌఖిక ఆదేశాలతో తిరుపతిలో కొందరు, శ్రీకాళహస్తిలో బదిలీ ఆర్డరు తీసున్న ఇద్దరు లైన్ ఇన్‌స్పెక్టర్లు రిలీవ్ కాకుండా కొనసాగుతున్నట్లు తెలిసింది. దీనిపై క్షేత్రస్థాయిలో ఏఈలను వివరణ కోరగా.. ఉన్నత స్థాయి అధికారుల మౌఖిక ఆదేశాలు ఉన్నాయని చెబుతున్నారని చెప్పారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఈఈ చిన్నరెడ్డెప్పను విచారించగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. బదిలీ చేసినవారు రిలీవ్ కాలేదన్న విషయం తమ దృష్టికి వచ్చిందని సీజీఎం హెచ్ఆర్‌డీ రమణాదేవి తెలిపారు. ఆ విషయాన్ని సీఎండీతో చర్చించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మాతృభాషతోనే మానసిక వికాసం

● '30 రోజుల్లో తెలుగు రీడింగ్ ఛాలెంజ్' ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో కేవీఎన్ కమార్

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మాతృభాషతోనే మానసిక వికాసం కలుగుతుందని, విద్య, విజ్ఞానం సమకూరుతుందని డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. జిల్లాకు సంబంధించి రెండు పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన '30 రోజుల్లో తెలుగు రీడింగ్ ఛాలెంజ్' కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. తిరుపతిలోని సంజయ్‌గాంధీ కాలనీలోని మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాతృభాషపై పట్టుసాధిస్తేనే ఇతర భాషల్లోనూ ప్రావీణ్యం సాధించగలమన్నారు.అందుకే విద్యార్థులందరికీ తెలుగు ధారాళంగా చదవడం, మాట్లాడేలా తీర్చిదిద్దేందుకు 'తెలుగు రీడింగ్ ఛాలెంజ్' కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు చెప్పారు. కార్యక్రమ నిర్వాహకుడు భాస్కర్‌రాజు ఎడ్యుకేషనల్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ భాస్కర్‌రాజు మాట్లాడుతూ.. 30 రోజుల్లో ధారాళంగా చదవగలిగేలా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా ఓ ప్రోగ్రామ్‌ను రూపొందించి సత్ఫలితాలు సాధించినట్టు చెప్పారు. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభం కావడం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అనంతరం భాస్కర్‌రాజు రూపొందించిన తెలుగుభాష సంజీవిని పుస్తకాలను విద్యార్థులకు డీఈవో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఈవో బాలాజీ, డీఈవో కార్యాలయ ఐటీ సెల్ మానిటరింగ్ అధికారి ధనుంజయులు నాయుడు, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు అనిల్‌కుమార్, తెలుగు ఉపాధ్యాయిని విజయకుమారి, ఇతర ఉపాధ్యాయులు, భాస్కర్‌రాజు ఎడ్యుకేషనల్ రీసెర్చ్ సెంటర్ ఇన్‌స్ట్రక్టర్ అశ్విని తదితరులు పాల్గొన్నారు.

ఓఎల్ఎక్స్‌లో పరిచయం

● ఉద్యోగం పేరిట అసభ్యకర చాటింగ్‌పై ఫిర్యాదు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఉద్యోగావకాశాలను చూస్తుండగా ఓఎల్ఎక్స్‌లో పరిచయమయ్యాడు. కార్యాలయం పెడతామంటూ తిరుపతికి వచ్చాడు. ఆపై సినిమాకు, తిరుమలకు వెళ్దామంటూ ఆ మహిళను ఒత్తిడి చేశాడు. ఈ మేరకు బాధితురాలి భర్త శుక్రవారం అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలిపిరి ఎస్ఐ లోకేష్‌బాబు తెలిపిన ప్రకారం.. తిరుపతి నగరం కొర్లగుంటకు ఓ వివాహిత ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. ఓఎల్ఎక్స్‌లో సెర్చ్ చేస్తుండగా హైదరాబాదుకు చెందిన సునీల్‌కుమార్ మొబైల్ నెంబరు అందులో కనిపించింది. ఉద్యోగం కోసం ఆమె అతడితో వాట్సాప్ ద్వారా చాటింగ్ ప్రారంభించారు. కొద్ది రోజుల క్రితం తిరుపతికి వచ్చిన సునీల్‌కుమార్.. ఇక్కడ ఓఎల్ఎక్స్ కార్యాలయం పెట్టేందుకు గది చూడాలని చెప్పాడు. ఇద్దరూ అద్దెకు గది కోసం వెదికారు. ఇటీవల హోటల్‌లో భోజనం చేశాక తిరుమలకు వెళ్దామని ఆమెను పిలిచాడు. ఆమె ససేమిరా అన్నారు. తాను లీలామహల్ వద్ద ఉన్నానని, సినిమాకు వెళ్దామంటూ ఆమెతో చాటింగ్ చేశాడు. అతడి వైఖరిని అనుమానించిన ఆమె భర్తకు విషయం చెప్పారు. వెంటనే వారు డయల్ 100కు ఫోను చేసి ఫిర్యాదు చేశారు. వీరిచ్చిన సమాచారం మేరకు సునీల్‌కుమార్‌ను అలిపిరి ఎస్ఐ లోకేష్‌బాబు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

18 నుంచి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

చంద్రగిరి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 18 నుంచి 26వ తేది వరకు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల బుక్‌లెట్లను టీటీడీ ఈవో శ్యామలారావు శుక్రవారం సాయంత్రం తిరుమలలోని ఈవో క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో 13న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుందన్నారు. 17వ తేది అంకురార్పణ, 18న ధ్వజారోహణం, రాత్రి పెద్దశేష వాహనం, 19న ఉదయం చిన్నశేష, రాత్రి హంస, 20న సింహ, ముత్యపు పందిరి, 21న కల్పవృక్ష, సర్వభూపాల, 22న మోహినీ అవతారం, రాత్రి గరుడ సేవ, 23న హనుమంతు, సాయంత్రం స్వర్ణ రథోత్సవం, రాత్రి గజ వాహనం, 24న సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ, 25న రథోత్సవం, అశ్వవాహన సేవలు ఉంటాయని ఈవో వివరించారు. 26న ఉదయం చక్ర స్నానం, రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, అర్చకులు పార్థసారధి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ ఈవో, అధికారులు

వైసీపీకి షాక్

● పార్టీకి జడ్పీటీసీ, ముగ్గురు ఎంపీటీసీలు, ఇద్దరు సర్పంచులు, కార్యకర్తల రాజీనామా

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో వైసీపీకి పెద్ద షాక్ తగిలింది. ఆ పార్టీ మండల కన్వీనర్ ఆరణి విద్యానాథరెడ్డిని పార్టీ నుంచి సస్పెండు చేశారు. ఆయనకు మద్దతుగా జడ్పీటీసీ సభ్యురాలు ఆరణి ప్రతిమ, ఆర్అనంతపురం, కాటూరు, ఆలత్తూరు ఎంపీటీసీ సభ్యులు పుట్టయ్య, రవి, వరలక్ష్మి, వెస్ట్‌వరత్తూరు సర్పంచ్ దయా, బీఎన్‌కండ్రిగ సర్పంచ్ మునిరాజా, పలువురు కార్యకర్తలు వైసీపీకి రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం నీర్పాకోటలో ప్రకటించారు. మరికొందరు ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు కూడా రాజీనామా చేయనున్నారని జడ్పీటీసీ ప్రతిమ తెలిపారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో తమ సత్తా చాటతామన్నారు. వైసీపీ మండల సచివాలయ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, నాయకులు గిరిరెడ్డి, మునస్వామి, భాస్కరయ్య తదితరులున్నారు.

మిస్ గ్లోబల్ ఆసియా విజేతకు సీఎం అభినందన

చంద్రగిరి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మలేషియాలో జరిగిన మిస్ గ్లోబల్ ఆసియా పోటీలలో విజేతగా నిలిచిన చంద్రగిరికి చెందిన భావనరెడ్డిని సీఎం చంద్రబాబునాయుడు అభినందించారు. విజేతగా నిలిచిన ఆమె తన తండ్రి గోపికృష్ణతో పాటు తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నీఆర్ రాజన్, టీడీపీ నాయకులు పులికంటి మోహన్‌రెడ్డి, ఆర్.బాలాజీ, ఆర్.ప్రవీణ్, కోటేశ్వరరావు, శేఖర్, బాషాతో పాటు సీఎం చంద్రబాబును కలిశారు. అంతర్జాతీయ వేదికపై చంద్రగిరి పేరును గట్టిగా వినిపించారంటూ సీఎం ఆమెను ప్రశంసించారు. మంత్రులు కొల్లు రవీంద్ర, రాంప్రసాద్‌రెడ్డిని కూడా వీరు కలిశారు.



భావనరెడ్డిని అభినందిస్తున్న సీఎం చంద్రబాబు

వ్యాపారంతో పాటు సమాజంపై బాధ్యతా ఉండాలి

● మందుల విక్రయదారుల అవగాహన సదస్సులో ఎస్పీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి(వైద్యం),ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): 'వయసుతో సంబంధం లేకుండా కొందరు పలు రకాల మత్తుకు బానిసలవుతున్నారు. నేరాలకు పాల్పడుతున్నారు. దీన్ని అరికట్టాలంటే మీ సహకారం అవసరం. వ్యాపారంతో పాటు సమాజంపై బాధ్యత కూడా ప్రధానమనే విషయాన్ని మీరు దృష్టిలో పెట్టుకోవాలి' అని జిల్లాలోని ఔషధ విక్రయదారులకు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సూచించారు. తిరుపతి నగరం కరకంబాడి రోడ్డులోని ఫ్యాబ్ భవనంలో డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడారు. జిల్లాను డ్రగ్స్ రహితంగా మార్చేందుకు అందరి సహకారం అవసరమన్నారు. గంజాయి, మాదకద్రవ్యాలతో పాటు కొందరు మందుల దుకాణాల్లో లభించే పలు మత్తునిచ్చే ఔషధాలకు అలవాటు పడి ఆరోగ్యంతోపాటు జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. దీనిని అరికట్టాలంటే డాక్టర్ రశీదు లేకుండా మందులు విక్రయించడం, చిన్నారులకు మందులు విక్రయించడం వంటివి చేయకూడదన్నారు. రశీదులు నిజమైనవా, నకిలీవా అనేది చూసుకోవాలన్నారు. కొన్ని నిషేధిత మందులు, మత్తును ఇచ్చే మందుల విక్రయాల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమించి మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రుయాస్పత్రి డీ అడిక్షన్ సెంటర్ మానసిక వైద్య నిపుణురాలు మానస మాట్లాడుతూ అనుభవంతో ఇచ్చే కొన్ని రకాల మందుల వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతినే అవకాశముందని తెలిపారు. డాక్టర్ సలహా లేకుండా మందులు ఇస్తే ఎలాంటి నష్టాలు ఉంటాయనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్పీ హేమంత్, అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ శ్రీలత, డీఐవోలు సుభాషిణి, రూతు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా మహాశివరాత్రి ఏర్పాట్లు



త్రినేత్ర అతిథి గృహం వద్ద రంగులు అద్దుతున్న కళాకారులు





స్వామి అమ్మవార్ల వాహనాలకు రంగులు అద్దుతున్న దృశ్యం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జంగమయ్య పండుగ మహాశివరాత్రి వేడుకలకు శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 21వ తేదీ నుంచి మార్చి 6వ తేదీ వరకు 14రోజుల పాటు అంగరంగ వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. 26న మహాశివరాత్రి, 27 ఉదయం రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం, 28వ తేదీ అర్థరాత్రి శివపార్వతుల కల్యాణం, మార్చి 2న గిరిప్రదక్షిణ, 4న పల్లకీ సేవ ఉత్సవాలు ప్రధాన ఘట్టాలు. ఆయా రోజుల్లో జరిగే ఉత్సవాలకు పెద్దఎత్తున భక్తుల రద్దీ ఉంటుంది. అందుకు అనుగుణంగా భక్తులు బస చేసేందుకు షెడ్లు, ఇతర సౌకర్యాలను సిద్ధం చేస్తున్నారు. ఆలయం లోపల గురువారం రంగురంగుల ముగ్గులు తీర్చిదిద్దారు. స్వామి అమ్మవార్ల వాహనాలకు రంగులు అద్దుతున్నారు. అలాగే ధ్వజస్తంభం, మహద్వారం ప్రదేశాల్లో అద్దిన రంగులు భక్తులను ఆకట్టుకున్నాయి.

డాలర్ కేంద్రం డొల్లతనం

● పాడైన పైకప్పు, ఊడుతున్న గోడపెచ్చులు



తిరుమల, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): డాలర్ల విక్రయ కేంద్రం అస్తవ్యస్తంగా తయారైంది. పాడైపోయిన పైకప్పు, ఊడుతున్న గోడపెచ్చులతో ఆందోళన కలిగిస్తోంది. 40 ఏళ్లుగా టీటీడీ శ్రీనివాసుడు, పద్మావతి అమ్మవార్లుండే బంగారు, వెండి డాలర్లను విక్రయిస్తోంది. భక్తుల నుంచి మంచి స్పందన వస్తున్న క్రమంలో తొలుత బయోమెట్రిక్, తర్వాత లడ్డూకౌంటర్ల వద్దకు విక్రయకేంద్రాన్ని మార్చారు. భక్తులకు అందుబాటులో ఉండేలా ఆరేళ్ల క్రితం శ్రీవారి ఆలయం ముందున్న పుస్తకవిక్రయశాల వద్ద విక్రయ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలోని ఈ కౌంటర్ ద్వారా రోజుకు రూ.10లక్షల నుంచి రూ.15 లక్షల వరకు విక్రయాలు జరుగుతాయి. పర్వదినాల్లో రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు విక్రయాలుంటాయి. అక్షయతృతీయ వంటి రోజుల్లో రూ.75 లక్షల వరకు అమ్మకాలు సాగుతాయి. ఇంత విలువైన కౌంటరు పైకప్పుతో పాటు గోడపెచ్చులు ఊడిపడుతున్నాయి. వర్షమొస్తే రేకుల నుంచినీరు కౌంటర్‌లోకి చేరుతోంది. సిబ్బంది ప్లాస్టిక్ బకెట్లు పెడుతున్నారు. కౌంటర్ వద్ద కనీస భద్రత లేదు. గేట్లకు గొళ్లాలు కూడా లేకపోవడంతో సిబ్బంది భయంభయంగా విధులు నిర్వహిస్తున్నారు. కాగా ఇటీవల వెండి, రాగి డాలర్ల కోసం వస్తున్న భక్తులు నోస్టాక్ బోర్డు చూసి నిరాశ చెందుతున్నారు.



పాడైపోయిన పైకప్పు, గోడలు

జల వనరుల పెంపునకు చర్యలు

కాళంగి గ్రాయిన్, మీజూరు చెక్ డ్యాం, పెళ్లకూరు మినీ రిజర్వాయర్ నిర్మాణానికి ప్రణాళిక

తడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలో జల వనరులను పెంపొందించేందుకు ఎమ్మెల్యే విజయశ్రీ శ్రీకారం చుట్టారు. గత ఐదేళ్లగా వైసీపీ ప్రభుత్వంలో మూలపడ్డ జలవనరుల పథకాలకు మహర్దశ తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగా కాళంగి నది పులికాట్ సరస్సులో కలిసేచోట గ్రాయిన్ ఏర్పాటు, పెళ్లకూరులో మినీ రిజర్వాయర్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశారు. సూళ్లూరుపేట, తడ మండలాలకు సాగు, తాగునీటికి కాళంగి నది నీళ్లు ఎంతో ఉపయోగపడతాయి. పులికాట్‌లో సరస్సులోని ఉప్పునీరు కాళంగిలోకి వచ్చేస్తుండడంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో భూగర్భజలాలు ఉప్పునీటిమయం అయిపోతుండడంతో గ్రాయిన్ నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.9.80 కోట్లతో అంచనాలు రూపొందించి ఐదు సార్లు టెండర్లకు ఆహ్వానించినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఇక దొరవారిసత్రం మండలం మీజూరు వద్ద మూడు చోట్ల చెక్ డ్యాంల నిర్మాణానికి అటవీశాఖ అడ్డంకులతో అడుగు ముందుకు పడలేదు. వీటితో పాటు పెళ్లకూరు వద్ద మినీ రిజర్వాయర్ నిర్మిస్తామని 2017లో అప్పటి ప్రతిపక్ష నేత జగన్ హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదు.

కూటమి ప్రభుత్వంలో కదలిక

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జల వనరులశాఖ పనుల్లో కదలిక వచ్చింది. ముఖ్యంగా తడ మండలం వాటంబేడు వద్ద గ్రాయిన్ నిర్మాణానికి ఓకే చెప్పింది. 135 మీటర్ల పొడవుతో వరదనీటిని నిల్వ చేసేలా గేట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించి, ఆ మేరకు రూ.23 కోట్లతో అధికారులు అంచనాలు సిద్ధం చేశారు. ఇక దొరవారిసత్రం మండలం మీజూరు, కారికాడు, ఏలికాడు వద్ద 1.2 మీటర్ల ఎత్తుతో నాలుగు చెక్ డ్యాంలను నిర్మించేందుకు రూ.6 కోట్లతో అంచనాలు రూపొందించారు. పెళ్లకూరులో మినీ రిజర్వాయర్ కోసం రూ.32 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశారు.



దెబ్బతిన్న కాళంగి గ్రాయిన్ (ఫైల్‌ఫొటో)

ఈ మూడు పథకాలకు అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి పంపామని, నుంచి అనుమతులు రాగానే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని జలవనరుల శాఖ డీఈ శ్రీధర్ తెలిపారు.

త్వరలోనే అనుమతులు: ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట నియోజకవర్గంలో సాగు, తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో తమ మొదటి ప్రాధాన్యంగా కాళంగి గ్రాయిన్, చెక్ డ్యాంలు, మినీ రిజర్వాయర్ నిర్మించాలని నిర్ణయించామని ఎమ్మెల్యే విజయశ్రీ తెలిపారు. ఈ మేరకు నివేదికలను ప్రభుత్వానికి పంపామని, త్వరలోనే అనుమతులు తీసుకొచ్చి, ఆ పనులను ఏడాదిలో పూర్తయ్యేలా చూస్తామని ఎమ్మెల్యే చెప్పారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సివిల్ జడ్జి అనూషా

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి కార్మికుడూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సివిల్ జడ్జి అనూషా అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికులు తమ కుటుంబసభ్యులకు కూడా చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజేష్, కోటీశ్వరరావు, గిరిజాకుమారి, స్వప్న, మహేష్, డిపో మేనేజర్ రామకృష్ణ, ఆర్టీసీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, ఎంపీపీ ధనలక్ష్మి, ఎంపీడీవో సురేష్‌బాబు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దోమలు ఎక్కువై ప్రజలు జ్వరాల భారిన పడకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వేసవి సమీపిస్తున్న దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అంగన్‌వాడీ భవనాలు లేని ప్రాంతాల వివరాలు ఇస్తే కొత్త భవనాల మంజూరు చేయిస్తామన్నారు. అనంతరం ఆయా శాఖ అధికారులు సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ ధనలక్ష్మి, ఎంపీడీవో సురేష్‌బాబు, తహసీల్దారు రాజేంద్ర, అన్నిశాఖల అధికారులు, సర్పంచులు, పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నేరం



మార్కెట్ పరిసరాలను పరిశీలిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నేరమని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక కూరగాయల మార్కెట్‌తో పాటు పలు ప్రాంతాలను డీఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో కొందరు మద్యం తాగడం, దూమపానం చేస్తూ పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నారన్నారు. ఆయా ప్రాంతాలను మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయడం జరిగిందన్నారు. మరోసారి సదరు ప్రాంతాలను అపరిశుభ్రం చేస్తే కఠిన చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ శేఖర్‌బాబు, ఎస్‌ఐలు తిరుపతయ్య, సుబ్రహ్మణ్యంరాజు,

జెట్టి నిర్మాణానికి స్థల పరిశీలన



సముద్రతీరంలో జెట్టి నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు, మెరైన్ ఎస్ఐ శివసామ్య

కోట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గోవిందపల్లిపాళెం గ్రామంలో జెట్టి నిర్మాణానికి సంబంధించి శుక్రవారం అధికారులు స్థల పరిశీలన చేశారు. తహసీల్దారు జయజయరావు, మెరైన్ సబ్ ఇన్‌స్పెక్టర్ శివసామ్య, ఎఫ్‌డీవో రెడ్యానాయక్ సముద్రం వెంబడి ప్రాంతాలతో పాటు ముఖ ద్వారాలను పరిశీలించారు. ఇక్కడ ఉన్న జెట్టి శిథిలావస్థకు చేరుకోవడంతో దాని స్థానంలో కొత్త నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. అదే విధంగా ఫిషింగ్ హార్బర్ నిర్మాణాన్ని అనువైన స్థలాలను అధికారుల బృందం పరిశీలించింది. కార్యక్రమంలో సర్వేయర్ గోపీరెడ్డి, వీఆర్వో వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య, ఫిషరీష్ అసిస్టెంట్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే పేదరిక నిర్మూలన

చిల్లకూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యతో పేదరికాన్ని జయించవచ్చునని రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ రాజనేని శ్రీనివాసులు నాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని నెలబల్లిరెట్టపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రాజనేని రామయ్య నాయుడు, అమీద్, కిరణ్ కుమార్‌రెడ్డి, హెచ్‌ఎంలు విజయలక్ష్మి, శివసుబ్రహ్మణ్యం, సునీల్, ఉపాధ్యాయులు ప్రజేంద్రరెడ్డి, మునిభాస్కర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాల కేంద్రం వద్ద ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1గంట వరకు వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ మునిరవిచంద్ర తెలిపారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

సూళ్లూరుపేట: చెంగాళమ్మ ఆలయం, మన్నారుపోలూరులో ఉన్న 220 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సూళ్లూరుపేట పట్టణం బాపూజీవీధి, పరమేశ్వరి నగర్, సాయినగర్, రైల్వేగేటు పడమటివైపు, మన్నారుపోలూరు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరాఫరాకు ఉండదని ఏడీఈ శేఖర్ తెలిపారు.

రాయితీ రుణాలను అర్హులందరికీ ఇవ్వాలి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా అందించే రుణాలను అర్హులందరికీ ఇవ్వాలని లీడ్‌బ్యాంక్ మేనేజర్ విశ్వనాథరెడ్డి అన్నారు. శుక్రవారం సూళ్లూరుపేట మండల సమాఖ్య కార్యాలయంలో సూళ్లూరుపేట, తడ, దొరవారి సత్రం మండలాల అధికారులు, బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులు ఎటువంటి షరతులు లేకుండా అర్హులందరికీ రుణాలను అందజేయాలన్నారు. అదే విధంగా పొదుపు గ్రూపులో ఉన్న సభ్యులు రూ.5 లక్షలు వరకు వ్యక్తిగత రుణాలు తీసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమీలారాణి, ఏపీవోలు ప్రసన్న, రాజారెడ్డి, సీసీలు ఉమాశంకర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలి: ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్మయి, పక్కన ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను పెండింగ్‌లో లేకుండా వెంటనే పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ చైర్మన్ ఆర్డీవో కిరణ్మయి అన్నారు. శుక్రవారం సూళ్లూరుపేట మండల పరిషత్ కార్యాలయంలో డివిజన్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ చట్టం కింద నమోదైన కేసుల పురోగతిని క్రమం తప్పకుండా పరిశీలించి పర్యవేక్షణ చేయడం ద్వారా బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలు, నమోదైన కేసులను తక్షణమే విచారించి బాధితులకు న్యాయం జరిగేలా ప్రత్యేక చొరవ తీసుకొంటుదన్నారు. కార్యక్రమంలో నాయుడుపేట, శ్రీసిటీ, పుత్తూరు డీఎస్పీలు చెంచుబాబు, వైడేశ్వరరావు, రవికుమార్, సీఐలు మురళీకృష్ణ, సంఘమేశ్వరరావు, సూళ్లూరుపేట, దొరవారిసత్రం, నాయుడుపేట తహసీల్దార్లు ఎస్వీ నరసింహరావు, శైలాకుమారి, రాజేంద్ర ఎంపీడీవో ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరి చేయించడం నేరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానా బేగం

గూడూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కార్మికుల చేత నిర్బంధంగా వెట్టిచాకిరి చేయిండం నేరమని ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానా బేగం అన్నారు. శుక్రవారం ఆర్టీసీ డిపోలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా నగదు అప్పుగా ఇచ్చి వారి చేత వెట్టిచాకిరి చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అటువంటి చర్యలు ఎక్కడ జరుగుతున్నా వాటిని అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రతిఒక్కరికీ స్వేచ్ఛగా జీవించే హక్కు ఉందన్నారు. చట్టాలను అతిక్రమించి ప్రవర్తించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు, సీనియర్ సివిల్ జడ్జి రాజేష్, మెహబూబ్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

నేషనల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్‌లో నాయుడుపేటవాసులకు పురస్కారం



నేషనల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్‌లో పురస్కారంతో నాయుడుపేట వాసులు

నాయుడుపేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఒడిసాలోని రూర్కెలాలో ఈనెల 1, 2 తేదీల్లో జరిగిన నేషనల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్ (ఎన్‌ఈఎస్)లో నాయుడుపేటకు చెందిన డాక్టర్ సుజిత్‌మౌళి, సత్యం కుమార్, సుస్యంక్ పురస్కారం అందుకున్నారు. నేషనల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్‌లో 70మంది పాల్గొని తమ థీసెస్‌లో వివిధ రకాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఊపిరితిత్తుల ఎక్స్‌రేలో ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్(ఏఐ) ద్వారా ముందస్తుగా టీబీని గుర్తించే థిసెస్ సమర్పించిన డాక్టర్ సుజిత్‌మౌళి, సత్యంకుమార్, సుస్యంక్ బృందం రన్నర్‌గా నిలవడంతో పురస్కారం అందించారు.

నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో నేడు భీష్మ ఏకాదశి వేడుకలు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట స్వర్ణముఖినది తీరాన వెలసిన ప్రసూనాంబసమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శనివారం భీష్మ ఏకాదశి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ గూడూరు సుధీర్‌రెడ్డి తెలిపారు. ఉదయం గణపతిహోమం, మహాన్యాశపూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, సాయంత్రం రుద్రహోమం, అమ్మవారికి సామూహిక సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహిస్తామన్నారు.

గురుకుల విద్యార్థులకు వైద్య పరీక్షలు

వాకాడు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో శుక్రవారం బాలిరెడ్డిపాళెం వైద్య అధికారిణి దీప్తి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ దీప్తి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి సలోమీ, ఏఎన్‌ఎం ఇంగిలీల నాగమణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేవైఎం ప్రతినిధులు

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పోటుపాళెం జాతీయ రహదారి వద్ద అండర్ పాస్‌ను నిర్మించేందుకు రూ.45.82 కోట్లు మంజూరు చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్రమంత్రి నితిన్ గడ్కకరీకి బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్ అభినందనలు తెలిపారు. శుక్రవారం స్థానిక బీజేవైఎం కార్యాలయం వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో శివశంకర్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

చిల్లకూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అదానీ ఫౌండేషన్ ప్రతినిధి సాయినాథ్ అన్నారు. శుక్రవారం మండలంలోని తమ్మనపట్నం గ్రామంలో అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పారిశుధ్యం మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచు సుబ్రహ్మణ్యం, అరుణ్, రమేష్‌బాబు, వెంకటేశ్వర్లు, ఈశ్వరయ్య, మధురానగర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అన్నదానం

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారుపేట బీసీ కాలనీలో ఉన్న విష్ణుదుర్గా పరమేశ్వరి ఆలయంలో రాజశ్యామల నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వివేకానంద యువసైన్యం ఆధ్వర్యంలో ఏపీపీ ప్రకృతికుమార్ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సోమల భాస్కర్ రాజు, కుమరన్, చిన్నమద్దెరి గోపీనాథ్, గుగ్గిళ్ల కోటీశ్వరరావు, గణేష్, శ్రీనివాసులు, మోహిత్, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల చర్చలు సఫలం



కమిషనర్ ఫజులుల్లాకు వినతిపత్రం ఇస్తున్న మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్మికులు

నాయుడుపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులు, యూనియన్ గౌరవ అధ్యక్షుడు చాపల వెంకటేశ్వర్లు, కమిషనర్ ఫజులుల్లా నడుమ చర్చలు సఫలం అయ్యాయి. శుక్రవారం కార్మికులతో పాటు చాపల వెంకటేశ్వర్లు, కమిషనర్ ఫజులుల్లాను కలిసి మాట్లాడారు. కార్మికులకు రావాల్సిన బకాయిలను రెండు నెలల్లో పూర్తిస్థాయిలో చెల్లిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. అలాగే కార్మికులు మృతి చెందితే వారి కుటుంబాలకు రూ2 లక్షల పరిహారం, సంక్రాంతి బోనస్‌గా రూ.1000 అందిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు మధు, హరి, శ్యామలమ్మ, మహాలక్ష్మమ్మ, ఆకావళి, మస్తానయ్య, మణి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నిర్మూలనతో ఆరోగ్యం

చిట్టమూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నులి పురుగుల నిర్మూలనతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో మనోహర్ గౌడ్ అన్నారు. ఈనెల 10 నుంచి 17 వరకు జరిగే నులి పురుగుల నిర్మూలన వారోత్సవం పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యాధికారిని పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలన మాత్రల పంపిణీ

వాకాడు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని మండలంలో పకడ్బందీగా నిర్వహించామని వైద్యాధికారిణి దీప్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏఎన్‌ఎం, ఆశా, ఐసీడీఎస్ సిబ్బందికి నులిపురుగుల నిర్మూలన మాత్రలు అందజేశారు. ఎంపీడీవో అన్నపూర్ణరావు మాట్లాడుతూ ఈనెల 10న 19 యేళ్లలోపు వయస్సు గల పిల్లలందరికీ ఆల్‌బెండజోల్ మాత్రలు వేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు రామయ్య, కమ్యూనిటీ హెల్త్ అధికారి సలోమీ పాల్గొన్నారు.

బైక్ నుంచి పడి వృద్ధుడి మృతి



శీనయ్య మృతదేహం

తడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బైక్‌లో వెళ్తూ అస్వస్థతకు గురైన వృద్ధుడు కిందపడి గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. నెల్లూరు గుడపల్లిపాడు గ్రామానికి చెందిన రావినూతల శీనయ్య(60) చెన్నై కార్పొరేషన్‌లో పని చేస్తున్నాడు. గత మంగళవారం బంధువుల ఇంట శుభ కార్యాలయానికి హాజరయ్యేందుకు బైక్‌పై నెల్లూరుకు బయలుదేరాడు. మార్గమధ్యంలో తడ మండలం పులివేంద్ర జాతీయ రహదారి వద్ద అస్వస్థతకు గురై కింద పడిపోయాడు. తీవ్ర గాయాలపాలై స్పృహకోల్పోయాడు. అతనిని దగ్గర ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించి, 108 వాహనంలో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం చెన్నై తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శీనయ్య శుక్రవారం ఉదయం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి



వెంకటరత్నం (ఫైల్‌ఫొటో)

పెళ్లకూరు, ఫిబ్రవరి 7, (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - పూతలపట్టు జాతీయ రహదారిపై శుక్రవారం కారు ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... మండలంలోని రావులపాడు గ్రామానికి చెందిన మందం వెంకటరత్నం(62) టెంకాయతోపు వద్ద 71వ జాతీయ రహదారిని దాటుతుండగా శ్రీకాళహస్తి నుంచి నాయుడుపేట వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకటరత్నం అక్కడికక్కడే మృతి చెందాడు. నాయుడపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాయితీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ల ద్వారా మంజూరు చేసే రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు కోరారు. అర్హులైన వారు ఈ నెల 12వ తేదీ లోగా ఏపీవోబీఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం



కోట మండలం గున్నంపడియా గ్రామంలో రైతుల ఆనందోత్సాహాలు

చిల్లకూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): క్రిస్‌సిటీ నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు కోరిన పరిహారం అందించిన సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు, ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు తమ్మినపట్నం, లింగవరం పంచాయతీల రైతులు ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం ఆయా పంచాయతీల్లో సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సతీష్ యాదవ్, సుబ్రహ్మణ్యం, కోటేశ్వరరావు, మణి, వెంకయ్య, రామయ్య, సునీల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కోట: మండల పరిధిలోని కొత్తపట్నం, యమదిన్నెపాళెం, గున్నంపడియా గ్రామాల్లో రైతులు మేళతాళాల నడుమ సీఎం చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, కలెక్టర్ వెంకటేశ్వర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. సీఎం, ఎమ్మెల్యే, కలెక్టర్ చిత్రపటాలను తలపై పెట్టుకొని చిందులేశారు. క్రిస్ సిటీకి అన్ని విధాలా సహకరిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, రైతులు కొమారి వెంకయ్యగౌడ్, వాటంబేటి చెంగల్‌రావు, శివకృష్ణ, చల్లా సురేష్, కృష్ణవేణయ్య, రాజ, అశోక్, రామయ్య, వెంకటయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.





నాయుడుపేటలో లైట్లు వేసుకుని వెళ్తున్న వాహనాలు - సూళ్లూరుపేటలో చెంగాళమ్మ ఆలయాన్ని కమ్మేసిన మంచు

మంచు దుప్పటి

నాయుడుపేట టౌన్, సూళ్లూరుపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణాన్ని శుక్రవారం పొగమంచు కప్పేసింది. ఉదయం 7 గంటలకు కూడా మంచు వీడకపోవడంతో వాహనచోదకులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వాహనాలు లైట్లు వేసుకొని వెళ్లాల్సి వచ్చింది. అలాగే సూళ్లూరుపేట పట్టణాన్ని దట్టమైన పొగ మంచు కమ్మేసింది. చెంగాళమ్మ ఆలయం, రాజగోపురం, జాతీయ రహదారితో పాటు పట్టణంలో ప్రధాన రహదారులన్నీ మంచుతో మూసుకుపోవడంతో వాహనాలు లైట్లు వేసుకొని వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది.